నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
వరంగల్
ఆదివారం | జూన్ 16, 2024 | www.navatelangana.com

కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

నగర మేయర్ గుండు సుధారాణి

కమిషనర్‌తో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన

నవతెలంగాణ-వరంగల్

కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శనివారం కమీషనర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి బల్దియా పరిధి 9 వ డివిజన్ లోని అలంకార్ జంక్షన్, కాకతీయ కాలనీ, యాదవనగర్ ఈ ఎల్ఎస్ఆర్, అమత థియేటర్ హనుమకొండ పోస్ట్, ఆఫీస్ చౌరస్తా ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి అభివద్ధి పనులు, శానిటేషన్ డిసిల్టింగ్ పనులను పరిశీలించి సమర్థ నిర్వహణకు సంబంధిత అధికారులకు మేయర్ తగు



సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కాకతీయ కాల నీలో కల్వర్టు సరిగా లేనందున నూతనంగా నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. 100 ఫీట్ల రోడ్ ప్రాంతంలో రోడ్డు వేయడానికి ప్రతిపాదనలు పంపించడం మంజూరు కావడం జరిగిందని, నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, ఇదే ప్రాంతంలో నిర్మాణ వ్యర్థాలు రోడ్డుపై ఉన్నందున, యజ మానికి లీటర్ పెనాల్టీ విధించాలని అధికారులను ఆదేశించారు. అమత టాకీస్ ప్రాంతాలలో డ్రైన్ నుండి తీసిన సిల్ట్ ను పరిశీలించి వర్షాకాలం నేప ధ్యం లో సిల్ట్ తొలగింపు ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని మేయర్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ చీకటి శారద, ఎస్ఈ కష్ణ రావు, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సిటీ ప్లానర్ వెంకన్న, ఈఈ రాజయ్య, డిఈ రవికుమార్, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి వరంగల్‌లో నలుగురు కలెక్టర్ల బదిలీ

హన్మకొండ కలెక్టర్‌గా ప్రావీణ్య

వరంగల్ కలెక్టర్‌గా సత్య శారదాదేవి

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం 20మంది ఐఎఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఛీఫ్ సెక్రటరీ శాంతాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం చేసిన ఈ బదిలీలలో హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా వరంగల్ కలెక్టర్‌గా పని చేస్తున్న పి. ప్రావీణ్యను నియమించారు. హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా పని చేసిన సిక్తా పట్నాయక్‌ను నారాయణపేటకు బదిలీ చేశారు. వ్యవసాయం, సహకార శాఖ జాయింట్ సెక్రటరీగా పని చేస్తున్న సత్య శారదాదేవిని వరంగల్ కలెక్టర్‌గా నియమించారు. వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా పని చేస్తున్న రాహుల్ శర్మను జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఇక్కడ కలెక్టర్‌గా పని చేస్తున్న భవేశ్ మిశ్రాను బదిలీ చేశారు. జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా పని చేస్తున్న టీఎస్ దివాకర్‌ను ములుగు కలెక్టర్‌గా నియమించారు. ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని బదిలీ చేశారు. దంప తులైన భవేశ్ మిశ్రా, ఇలా త్రిపాఠిలకు రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వలేదు.



జాతీయస్థాయి ఉపకార వేతనానికి విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-చెన్నరావుపేట


జాతీయస్థాయి ఉపకార విత్తనానికి మండలంలోని లింగాపురం విద్యార్థి ఎంపికయ్యారు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఆకులపల్లి అభిషేక్ ప్రతిష్టాత్మక నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం 8వ తరగతి విద్యార్థులకు దేశవ్యాప్తంగా ఈ స్కాలర్షిప్ పరీక్షను నిర్వహిస్తారు. గత విద్యా సంవత్సరం 2023-24లో నిర్వహించబడిన పరీక్షలో అభిషేక్ ఉత్తీర్ణుడై స్కాలర్షిప్ పొందడానికి అర్హత సాధించాడు. సంవత్సరానికి 12వేల రూపాయల చొప్పున మొత్తం నాలుగేండ్లకు 48వేల రూపాయల స్కాలర్షిప్‌ను అభిషేక్ పొందబోతున్నాడు. స్కాలర్షిప్ పరీక్షలో ప్రతిభ చాటినందుకుగాను విద్యార్థికి మార్గనిర్దేశనం చేసిన ఉపాధ్యాయ బందం జయశ్రీ, రమణయ్య, ఇంద్ర కరుణాకర్, సురేష్, పరమేశ్వర్, కుమారస్వామి, రాజ సులోచనలను లింగాపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సలీం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అనిత అభినందించారు.



మట్టిని తరలించకుండా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-పర్వతగిరి

వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ శివారు అక్కకుంట నుంచి ఇటుక బట్టీలకు మట్టి తరలించకుండా తగిన చర్యలు తీసుకోవాలని శనివారం తహశీల్దార్ విజయ్ సాగర్‌కు అంబేద్కర్ నగర్ చెందిన రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పంట పొలాలకు ఎవరో ఒకరు తీసుకువెళ్తే వారిపై అధికారులు పలు ఆకాంక్షలు విధిస్తూ,కేసులు నమోదు చేస్తామని చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా కొంతమంది అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఇటుక బట్టీల కోసం మట్టిని తరలిస్తున్న ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తూ వదిలి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తమ స్వంత లాభాల కోసం మట్టిని వ్యాపారంగా మార్చిన మట్టి మాఫీయా పై తగిన నిఘా ఏర్పాటు చేసి నియంత్రణ చర్యలు తీసుకోవాలని అక్కడి రైతులు కోరుతున్నారు.



శ్రీనివాస్ నాయక్‌కు ఈగ మల్లేశం పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ తండ్రి జాటోత్ అమనాయక్ ఇటీవల అనారోగ్య కారణంతో మరణించగా శనివారం కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం మతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం శ్రీనివాస్‌నాయక్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు వంగాల రవీందర్, చిమ్మాని గోపి తదితర నాయకులు పాల్గొన్నారు.



పారదర్శకంగా మిషన్ భగీరథ సర్వే..

నవతెలంగాణ-చెన్నారావుపేట

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతి ఇంటికి మిషన్ భగీరథ సర్వే అత్యంత పారదర్శకంగా చేపట్టాలని డీఎల్పీఓ వేదవతి సూచించారు. శనివారం మండల పరిధిలోని చెన్నారావుపేట గ్రామంలో మిషన్ భగీరథ కు సంబంధించి ఇంటింటా నల్ల కలెక్షనుల సర్వే పది రోజుల్లో పూర్తి కావాలని ఉద్దేశంతో పంచాయితీ కార్యదర్శి నమోదు ప్రక్రియ వేగంతో చేశారు. నల్ల కలెక్షను కలిగిన నివాసాలు ఇంకా ఇవ్వాల్సిన కలెక్షన్ ఇతర వివరాలతో కూడిన సమాచారాన్ని ఇంటింటికి వెళ్లి యజమానితో పాటు కుటుంబ సభ్యుల ఆధార్ నంబర్లు, ఫోన్ నెంబర్ ఇతర వివరాలు నీటి సరఫరా సంబంధించి ఫోటోలను యాప్లో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్ రాజ్, కార్యదర్శి వికాస్, ఫీల్డ్ అసిస్టెంట్, కారోబార్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఎన్‌పీడీసీఎల్‌కు సర్కార్ రూ.12,451 కోట్ల బకాయి

ఎత్తిపోతలదే రూ.8,825 కోట్లు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి


తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.12,451 కోట్లను బకాయిపడి వుంది. ఇందులో ఎత్తిపోతల పథకాలకు సంబంధించే రూ.8,825 కోట్లు బకాయిలుండడం గమనార్హం. దేవాదుల ఎత్తిపోతలకు సంబంధించి రూ.3,046 కోట్లు, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి రూ.4,752 కోట్లను విద్యుత్ బిల్లులుగా రాష్ట్ర ప్రభుత్వం కంపెనీకి చెల్లించాల్సి వుంది. ఈ బకాయిలు కూడా ఏప్రిల్ మాసం వరకు పేరుకుపోయినవి కావడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ప్రభుత్వ శాఖలు, కార్యాలయాలు, ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన విద్యుత్ బకాయిలు వేల కోట్ల మేరకు పేరుకుపోయి వున్నాయి. వరంగల్ కేంద్రంగా వున్న టిఎస్ ఎన్‌పిడి సిఎల్‌కు ఏప్రిల్ మాసాంతానికే మొత్తం రూ.12,451 కోట్లు బకాయిలుండడం చర్చనీయాంశంగా మారింది.

టిఎస్ఎన్‌పిడిసిఎల్ పరిధిలో మొత్తం 16 జిల్లాలున్నాయి. ఇందులో ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలున్నాయి. మైనర్ పంచాయతీలు, మేజర్ పంచాయతీలు, మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్, ఎత్తిపోతల పథకాలు, హెచ్ఎండబ్ల్యుఎస్, వైద్య, ఆరోగ్య, పోలీసు, రెవెన్యూ, ఉన్నత విద్య, సాంఘిక సంక్షేమం, బిసి సంక్షేమం, గిరిజన సంక్షేమం, పశుసంవర్ధక శాఖ, టూరిజం, మార్కెటింగ్ తదితర శాఖలు చెల్లించాల్సిన బకాయిలు నేటికీ కంపెనికి చెల్లించలేదు.

ఎత్తిపోతల బకాయిలు రూ.8,825 కోట్లు

ఎత్తిపోతల ప్రాజెక్టుల బకాయిలు కంపెనీ పరిధిలో రూ.8,825 కోట్ల మేరకు పేరుకుపోయాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా, కరీంనగర్ జిల్లాలోని దేవాదుల ప్రాజెక్టు, కాళేశ్వరం ప్రాజెక్టులకు సంబంధించిన ఎత్తిపోతలకు ఏప్రిల్ నాటికి రూ.8,825 కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం కంపెనీకి చెల్లించాల్సి వుంది. ఎత్తిపోతల పథకాలకు సంబంధించి ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాదుల ప్రాజెక్టు వుంది. దీనికి సంబంధించి రూ.3,046.49 కోట్ల విద్యుత్ బకాయిలున్నాయి. కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి రూ.4,752.39 కోట్ల బకాయిలు పేరుకుపోయి వున్నాయి. అదేవిధంగా ఖమ్మంలో రూ.116.50 కోట్లు, నిజామాబాద్‌లో రూ.750.30 కోట్లు, ఆదిలాబాద్‌లో రూ.159.39 కోట్లు బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం టిఎస్ఎన్‌పిడిసిఎల్‌కు చెల్లించాల్సి వుంది.





కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్‌కు సంబంధించి రూ.1,945 కోట్లు

నీటిపారుదల శాఖ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్‌కు సంబంధించి ఏప్రిల్ మాసాంతానికి రూ.1,945 కోట్ల బకాయిలున్నాయి. ఇందులో వరంగల్‌లో రూ.270.94 కోట్లు, కరీంనగర్‌లో 543.24 కోట్లు, ఖమ్మంలో రూ.476.85 కోట్లు, నిజామాబాద్‌లో రూ.312.87 కోట్లు, ఆదిలాబాద్‌లో రూ.341.62 కోట్ల మేరకు బకాయిలున్నాయి.

హెచ్ఎండబ్ల్యుఎస్ బకాయిలు రూ.1,033 కోట్లు

హైద్రాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ స్కీమ్‌కు సంబంధించి కరీంనగర్ జిల్లాలోనే రూ.1,033.16 కోట్ల విద్యుత్ బకాయిలున్నాయి. ఈ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం కంపెనీకి చెల్లించాల్సి వుంది. కంపెనీ పరిధిలో దీని కింద ఇతర జిల్లాల్లో ఈ పథకం అమలు లేదు.

పంచాయతీల బకాయిలే రూ.241.34 కోట్లు

ఈ కంపెనీ పరిధిలోని వున్న 5 ఉమ్మడి జిల్లాల్లో మైనర్ పంచాయతీలకు సంబంధించి ఏప్రిల్ మాసాంతానికి రూ.241.34 కోట్ల బకాయిలు పేరుకుపోయి వున్నాయి. ఈ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం కంపెనీకి చెల్లించాల్సి వుంది. ఈ పంచాయతీలకు సంబంధించి వరంగల్ జిల్లాలో రూ.46.14 కోట్లు, కరీంనగర్ రూ.42.72, ఖమ్మం జిల్లాలో రూ.42.45 కోట్లు, నిజామాబాద్‌లో రూ.73.83, ఆదిలాబాద్‌లో రూ.36.21 కోట్ల బకాయిలున్నాయి.

మేజర్ పంచాయితీల బకాయిలు రూ.55.53 కోట్లు

మేజర్ గ్రామ పంచాయతీలకు సంబంధించి కంపెనీ పరిధిలో ఏప్రిల్ మాసాంతానికి రూ.55.53 కోట్ల బకాయిలున్నాయి. వరంగల్‌లో రూ.6.94 కోట్లు, కరీంనగర్‌లో రూ.1.54, ఖమ్మంలో రూ.5.60, నిజామాబాద్‌లో రూ.36.72, ఆదిలాబాద్‌లో 5.62 కోట్ల బకాయిలున్నాయి.

మున్సిపాల్టీల బకాయిలు రూ.171.42 కోట్లు

మున్సిపాల్టీలకు సంబంధించి రూ.171.42 కోట్ల బకాయిలను సర్కార్, టిఎస్ఎన్‌పిడిసిఎల్‌కు చెల్లించాల్సి వుంది. వరంగల్ జిల్లాలో రూ.5.76 కోట్లు, కరీంనగర్‌లో రూ.40.61, ఖమ్మంలో 27.88, నిజామాబాద్‌లో 43.16, ఆదిలాబాద్‌లో 54.01 కోట్ల బకాయిలున్నాయి.

మున్సిపల్ కార్పొరేషన్‌ల బకాయిలు రూ.59.55 కోట్లు

మున్సిపల్ కార్పొరేషన్‌లకు సంబంధించి రూ.59.55 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. వరంగల్‌లో రూ.6.35 కోట్లు, కరీంనగర్‌లో రూ.22.27, ఖమ్మంలో రూ.19.52, నిజామాబాద్‌లో రూ.11.40 కోట్లు బకాయిలుండగా, ఆదిలాబాద్ జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్‌లు లేవు.

పాఠశాల విద్య బకాయిలు రూ.36.13 కోట్లు

ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి కంపెనీకి రూ.36.13 కోట్ల బకాయిలు చెల్లించాల్సి వుంది. వరంగల్ జిల్లాలో రూ.9.71 కోట్లు, కరీంనగర్ రూ.3.30, ఖమ్మంలో రూ.8.32, నిజామాబాద్‌లో రూ.6.06, ఆదిలాబాద్‌లో రూ.8.73 కోట్ల బకాయిలు పేరుకుపోయి వున్నాయి. ఈ ప్రభుత్వ శాఖలే కాకుండా ప్రభుత్వ ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాల విద్యుత్ బకాయిలు సైతం పేరుకుపోవడంతో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీకి భారీగా బకాయిల నిల్వ పెరుగుతుంది. ఇవే కాకుండా కోర్టులనాశ్రయించి పలువురు విద్యుత్ బకాయిలు చెల్లించకుండా వున్నవి సైతం సుమారు రూ.264 కోట్ల మేరకున్నాయి. యుడిసి, లైవ్, రెస్కోస్, బిల్ స్టాప్ అయినవి ఇలా మొత్తం ప్రభుత్వానికి సంబంధం లేని బకాయిలు సైతం రూ.2,170 కోట్లున్నాయి. ఇవన్నీ చెల్లింపులైతే కంపెనీ ఆర్థికంగా లాభాల బాటలో పయనిస్తుంది.

చింతకుంట మత్తడి ధ్వంసం..

కుంటతో పాటు ఫారెస్ట్ భూమి ఆక్రమణ

మత్తడి ధ్వంసంతో ఎండిపోయిన కుంట

మిషన్ కాకతీయతో ప్రజాధనం వృథా

పత్తాలేని ఫారెస్ట్ అధికారులు

ఆక్రమణలు అరికట్టి ఫారెస్ట్ భూమిని కాపాడాలని స్థానికుల వేడుకలు

నవతెలంగాణ-ఖానాపురం

ప్రభుత్వం చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడాలని పలు కార్యక్రమాలను ప్రవేశపెట్టి పచ్చదనాన్ని పెంపొందించే దిశగా అడుగులు వేస్తుంటే... కొందరు అక్రమార్కులు భూమి ఆక్రమణ ధ్యేయంగా మార్చుకొని ఫారెస్ట్‌లో ఉన్న కుంటతో పాటు పక్కనే ఉన్న చెట్లను నేల కూల్చి తమను ఎవరు ఏమీ చేయలేరనే రీతిలో భూమిని ఆక్రమించుకొని పచ్చని చెట్లను హరిస్తున్నారు. పక్షులకు, అడవి జంతువులకు, పశువుల దాహార్తిని తీర్చడానికి కుంట ఎంతగానో ఉపయోగపడుతుంది. కొందరు అక్రమార్కుల స్వార్థానికి కుంట





మత్తడిని ధ్వంసం చేయడంతో కుంటలోని నీరు వధాగా పోయింది. నీరు నిలువ లేకపోవడంతో జీవరాసులు దాహార్తితో అల్లాడుతున్నాయి.

వివరాల్లోకి వెళితే.. మండలంలోని మంగళవారిపేట గ్రామ శివారులో పోచారం సమీపంలో ఫారెస్ట్ పరిధిలో చింతకుంట ఉంది. భూగర్భ జలాలను పెంపొందించేందుకు కుంటలో గత ప్రభుత్వం లక్షలు వెచ్చించి మిషన్ భగీరథ పనులను సైతం చేపట్టింది. కుంట మత్తడి ధ్వంసం చేయడంతో నీటి నిల్వ తగ్గిపోయి ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరుల వధా అయింది. అక్రమార్కులు నీటి నిలువ ఉంటే తమ పంట నీటిలో మునుగితోందని మూర్ఖంగా ఆలోచించి కుంట మత్తడిని ధ్వంసం చేశారని స్థానికులు అంటున్నారు. కుంట చుట్టుపక్కల ఉన్న చెట్లను నరికి ఫారెస్ట్ భూమిని ఆక్రమించుకుంటున్నారనేది స్పష్టంగా కనిపిస్తుంది. ఈ తతంగం అంతా ఫారెస్ట్ అధికారులు కనుసన్నల్లోనే జరుగుతుందని ప్రజలు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకొకపోవడం వెనుక మతలబు ఏంటని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఫారెస్ట్ భూములను కాపాడి ఫారెస్ట్ అభివద్ధికి కషి చేయాల్సిన అధికారులు అక్రమార్కులకు అండగా నిలవడంపై ప్రజలు బహిరంగంగా తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇకనైనా ఫారెస్ట్ అధికారులు స్పందించి చింతకుంటను సందర్శించి విచారణ చేపట్టి ఫారెస్ట్ భూమితో సహా కుంటను సైతం కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆకేరు వాగు నుంచి ఇసుక అక్రమ తరలింపు

-అడ్డుకట్ట వేసే వారే లేరా..?

-పట్టించుకోని అధికారులు

-సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

నవతెలంగాణ-పర్వతగిరి

వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తి గ్రామం ఆకేరు వాగు పరిసర ప్రాంతాలలో జోరుగా అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారు.అయినప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం స్థానిక ప్రజలకు పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఇసుక మాఫీయాలో అక్రమార్కులు పెద్ద మొత్తంలోని ముడుపులు చెల్లించుకున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఈ అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగాకొనసాగుతోంది.ఏకంగా ప్రతీరోజూ పది జేసీబీలతో జోరుగా తవ్వుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో పడి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు చర్చనీయాంశమయవుతున్నాయి. ఈ విషయంపై పలుమార్లు



సంబంధిత అధికారుల దష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమని స్థానిక రైతులు, ప్రజలు బాహాటంగానే చెబుతున్నారు.ఈ నిర్లక్ష్యానికి ఎవరూ భాధ్యత వహిస్తారో అధికారులే చెప్పాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆకేరు వాగులో జరుగుతున్న ఈ అక్రమ ఇసుక రవాణా ను అరికట్టడం లో సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలి


నగర మేయర్ గుండు సుధారాణి

నవతెలంగాణ-వరంగల్

అభివృద్ధి పనులలో వేగగం పెంచి నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు.శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో అభివద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో డివిజన్ల వారిగా కూలంకషంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహా నగరంలో పట్టణ ప్రగతి, జనరల్ ఫండ్, సిఎంఎ,ఎస్సి, ఎస్టీ సబ్ ప్లాన్, స్మార్ట్ సిటీ తదితర పథకాల క్రింద కొనసాగుతున్న అభివద్ధి పనుల ప్రగతి సమీక్షించి సకాలం లో పూర్తి చేయడంతో పాటు టెండర్ అయిన పను లను తక్షణమే ప్రారంభించాలని, జనరల్ ఫండ్ క్రింద ఇంకను మిగిలియున్న పనులకు వెం టనే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.ఈ సమీ క్షలో ఈఈలు శ్రీనివాసరావు, సంజయ్ కుమా ర్, డీఈ



లు రవి కుమార్, సంతోష్ బాబు, రవి కిర ణ్, సారంగం, రంగారావు, జేఏఓ సరిత పాల్గొన్నారు.



నీట్ పేపర్ లీకేజీకి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

సుప్రీం కోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి

ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రాహుల్

నవతెలంగాణ- పర్వతగిరి

నీట్ పేపర్ లీకేజీ కి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ పర్వతగిరి మండల కార్యదర్శి రాహుల్ ప్రభుత్వాన్ని కోరారు.మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 4న విడుదలైన నీట్ పరీక్ష ఫలితాలలో 67మందికి 720 మార్కులకు గాను 720 మార్కులతో ఆల్ ఇండియా మొదటి ర్యాంకు రావడంతో పాటు అందులో ఆరుగురు విద్యార్థులు ఒకే పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసిన వారే ఉండటం గమనార్హం. గత సంవత్సరం ఇద్దరికి అంతకుముందు నలుగురికి మాత్రమే 720 మార్కులు ఆల్ ఇండియా ర్యాంక్ రాగా ఈ సంవత్సరం 67మందికి మొదటి ర్యాంకు రావడం పై దేశ వ్యాప్తంగా విద్యార్థులు తల్లిదండ్రులు విద్యార్థి సంఘాల నుంచి ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో న్యాయవిచరణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. నీట్ పరీక్ష 2024 పరీక్షలను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్, మహేష్, వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

సేవా స్వచ్ఛంద సంస్థకు ఉత్తమ పురస్కారం

నవతెలంగాణ-కాశిబుగ్గ

అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నగరంలోని దేశాయిపేటకు చెందిన సేవా స్వచ్ఛంద సంస్థకు ఉత్తమ స్వచ్ఛంద సంస్థ 2024 పురస్కారం లభించిందని సేవ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి అయిత ఉష భాస్కర్ తెలిపారు. అంతర్జాతీయ రక్త దాతల దినోత్సవం సందర్భంగా ఎంజీఎం హాస్పిటల్ లో నిరుపేద రోగులకు గర్భిణీలకు క్షత గాత్రులకు సకాలంలో రక్తదానం చేసి నందు కుగాను ఉత్తమ పుర స్కారం అందించి నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సేవా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు జూపాక రత్న ప్రణయ్, ఎంజియం రక్తనిది వైద్య అధికారిణి డాక్టర్ ఆశాదేవి రక్తదాతలు ల్యాబ్ టెక్నిషియన్లు పాల్గొన్నారు..

ట్రస్ట్‌కు ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-చెన్నారావుపేట

మండల పరిధిలోని లింగాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇందూరి రాజు తన చిన్న కుమారుడు రుత్విక్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా శనివారం మాతభూమి చారిటబుల్ ట్రస్ట్ (సంజీవని అనాధాశ్రమం) వారికి రిత్విక్ జ్ఞాపకార్థం పది వేల రూపాయలు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తొప్పెట రమేష్, తొప్పెట అఖిల్, కరుణాకర్, కమలాకర్, రాజకుమార్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



నవతెలంగాణ-పరకాల

నిరుపేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో షాదిముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకున్నప్పుడే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతార న్నారు. పేద కుటుంబాలకు, ఆడపిల్లల పెళ్లి భారం, ఖర్చులు తగ్గుతుందన్నారు. అన్నివర్గాల ప్రజలకు అండగా నిలబడడమే ప్రభుత్వ లక్ష్యమని అందుకు తగినట్లుగా అధికారులు నిరంతర సేవలో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ ప్రజాసేవలో భాగస్వాములు కావాలన్నారు. షాదీముబారక్,కళ్యాణ లక్ష్మి పథకం ని సద్వినియోగం చేసేలా నిరుపేదలకు, ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉండి ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే క్రమంలో నిరుపేదలను ఎలాంటి అయోమయాలకు గురి చేయకుండా, అవినీతికి తావు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పరకాల పట్టణంతో పాటు మండలములోని ఆయా గ్రామాల్లో షాది ముబారక్, కళ్యాణ లక్ష్మి 33 మంది లబ్దిదారులకు రూ.33,3868ల చెక్కులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు కొయ్యడ శ్రీనివాస్ , రాజేశ్వరరావు, గోనాద్, కౌన్సిలర్లు సంపత్, రాజు, తాసిల్దార్ వెంకట భాస్కర్, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ సిక్తా పట్నాయక్ బదిలీ



నవతెలంగాణ-సుబేదారి

హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ బదిలీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఇందులో హన్మకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ ను నారాయణపేట కలెక్టర్‌గా బదిలీచేశారు. 2023 ఫిబ్రవరిలో హన్మకొండ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సిక్తాపట్నాయక్ జిల్లా అభివృద్ధిలో, ఎన్నికల నిర్వహణలో తనదైన ముద్ర వేశారు. హనుమకొండ జిల్లాకు కొత్త కలెక్టర్‌గా వరంగల్ కలెక్టర్ పీ.ప్రావీణ్య రానున్నారు.

మీ సేవలో నిత్యం సదరం స్లాట్‌బుకింగ్

నవతెలంగాణ-సుబేదారి

మీ సేవా కేంద్రాలలోఎల్లప్పుడు సదరం క్యాంపు స్లాట్ బుకింగ్ ఉంటుందని హనుమకొండ డీఆర్‌డీఏ పిడి నాగపద్మజ తెలిపారు. సదరం సర్టిఫికేట్ గురించి ప్రతేకమైన స్లాట్‌బుకింగ్ తేదీ ప్రత్యేకంగా ఏమిలేదని సదరం సర్టిఫికేట్ కావాల్సిన వారు మీసేవా కేంద్రాలలో సర్టిఫికెట్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు శనివారం తెలిపారు. తర్వాత సదరం క్యాంపుకు సంబంధించి వారికి తేదీ కేటాయించ బడుతుందని తెలిపారు. ఆయా తేదిలలో సదరం క్యాంపుకు వెళ్లి పరీక్షించుకోవాలని పిడి కోరారు.

వీరభద్రస్వామి భూములకు రక్షణ కల్పించాలి



నవతెలంగాణ-భీమదేవరపల్లి

కొత్తకొండ వీరభద్ర స్వామి దేవాలయ భూములకు రక్షణ కల్పించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ భూములపై కార్యనిర్వా హణాధికారి కిషన్‌రావు ను అడిగి తెలుసుకున్నారు. దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఈవోను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయ సారథి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, కర్రె లక్ష్మణ్, కొట్టేపాక రవి, ఆదరి రమేష్, రావుల తిరుపతి, బాలరాజు, కుమారస్వామి పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రయాణించేదేలా ?



నవతెలంగాణ-శాయంపేట

మండల కేంద్రం నుండి కైలాసం రైస్‌మిల్లు మీదుగా కొత్తగట్టు సింగారం వరకు వరకు నిర్మించిన రోడ్డుపై ప్రయాణం వాహనదారులకు నరకప్రా యంగా మారింది. ఈ రోడ్డు గుండ ప్రయాణిస్తే కేవలం మూడు కిలో మీటర్ల ప్రయాణంలో కొత్తగట్టు సింగారం చేరుకోవచ్చు. ఈ రోడ్డుకు ఇరుపక్కల పెరిగిన ముళ్లపొదలు రోడ్డును కమ్మేస్తున్నాయి. మూలమలుపుల వద్ద ముళ్ళ చెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచు ప్రమాదాల బారినపడుతున్నారు. ఎస్సారెస్పీ కెనాల్ అవతల వైపు జెసిబితో రోడ్డు కిరువైపులా పెరిగిన అవెన్యూ ప్లాంటేషన్ చెట్లకొమ్మలను తొలగించి రోడ్డుపైన వేయడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకి ఇరువైపులా పెరిగిన ముళ్ళ పొదలను తొలగించాలని, రోడ్డుపై వేసిన కొమ్మలను తొలగించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు జగదీష్ అర్హత



నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దాసరి జగదీష్ జాతీయ స్థాయి నేషనల్ మెయిన్స్ మెరిట్ స్కాలర్షిప్ - 2023 కు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వనం వెంకటేశ్వర్లు తెలిపారు. మండలం నుండి ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ కు అర్హత సాధించిన ఏకైక విద్యార్థి జగదీష్ కావడం గమనార్హం. జగదీష్ ను శనివారం పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం



నవతెలంగాణ-దామెర

మండలంలోని దుర్గంపేటకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చిల్ల తిరుపతి మరణించగా పర కాల మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి, బి ఆర్ఎస్ పార్టీ దుర్గంపేట కార్యకర్తల సహకారంతో కుటుంబానికి రూ.25వేల నగదు, సామాగ్రిని అందించారు. ఈ సందర్భంగా పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండు రామకృష్ణ వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని అ లాగే కష్టపడి పని చేసే ప్రతీ కార్యకర్త కష్టాల్లో ఉన్న కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో దూర్యంపేట బీఆర్ఎస్ కార్యకర్తలు, నా యకులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రెడ్డిసంఘం అధ్యక్షులుగా చిట్టిరెడ్డి జలంధర్‌రెడ్డి

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని పత్తిపాక గ్రామరెడ్డి సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. అధ్యక్షులుగా చిట్టిరెడ్డి జలంధర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా వైద్యుల వెంకటరాజురెడ్డి, బండ హంస రెడ్డి, పింగిలి సాంబరెడ్డి, చిట్టిరెడ్డి విజయ్‌రెడ్డి, పోరెడ్డి రాజిరె డ్డి, ముసుకుల నరేష్‌రెడ్డిలను ఎన్ను కున్నట్లు తెలిపారు. సలహాదారులుగా మాజీ సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి, చిట్టిరెడ్డి జంగారెడ్డి ఎన్నికయ్యారు.

వ్యవసాయ రంగ సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించాలి

- **సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి**



నవతెలంగాణ-ఐనవోలు

వ్యవసాయ రంగ సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టి పరిష్కరించాలని. విత్తనాలు. ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలి సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. ఒంటిమామిడి పల్లెలో సీపీఎం మండల కమిటీ సమావేశం బండి పర్వతాలు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బోట్ల చక్రపాణి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ. రైతులకు అందుబాటులో విత్తనాలు ఎరువులు ఉంచాలని విత్తనాలు చెరువులను అధిక ధరలు అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకొని రద్దు చేయాలని. ధరణిలో జరిగిన లోపాలను స వరించి అర్హులైన అందరికి పాస్‌పుస్తకాలు ఇవ్వాలనీ అన్నారు. సమగ్ర భూసర్వే నిర్వహించి, గ్రామ సభలు జరిపి లోపాలను సవరించాలనీ సూచించారు. 2011 కౌలుచట్టాన్ని అమలు చేయాలన్నారు. సాగుదారులందరికి ప్రభుత్వం ప్రకటించిన రూ.12500 సబ్సిడి ఇవ్వాలనీ, పంటల బీమా పథకాన్ని రూపొందించి, ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి పంటల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రాధాన్యత క్రమంలో సాగునీటి పథకాలను పూర్తి చేయాలనీ, సబ్సిడీపై మైక్రోఇరిగేషన్(డ్రిప్,స్పింక్లర్)పథకాలు అమలు చేయాలని, ఐడిసి నిర్వహణలోని లిఫ్ట్ పథకాలను రిపెర్లు చేయాలనీ అన్నారు. కల్తీ విత్తనాలను సరఫరా చేస్తున్న నేరస్తులపై కఠినశిక్షలు వేయాలని, కల్తీ విత్తనాల వలన ఏటా 4,5 లక్షల ఎకరాలలో పంటలు దెబ్బతింటున్నాయనీ అన్నారు. విత్తన చట్టాన్ని రూపొందించాలన్నారు.

వ్యవసాయ శాఖ వార్షిక ప్రణాళికలు ప్రకటించాలని, ఈ వార్షిక ప్రణాళికలో ప్రాంతాల భూసారాన్నిబట్టి పంటల విధానాన్ని రూపొందించాలని పేర్కొన్నారు. రైతుభరోసా పథకం ప్రకారం ఎకరాకు రూ.15వేల చొప్పున రైతుల ఖాతాలో జూన్ నెలలో వేయాలని, రాష్ట్రస్థాయి 'వ్యవసాయ ఉత్పత్తుల ధరల నిర్ణాయక కమీషన్' ఏర్పాటుచేసి అన్నిపంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలనీ అన్నారు. రూ.2లక్షల లోపు రుణాలను ఏకకాలంలో మాఫీచేయాలని కోరారు. 'స్కేల్ ఆఫ్ ఫైనాన్స్' ప్రకారం రైతులకు రుణాలు ఇవ్వాలనీ, అటవీహక్కుల చట్టం -2006 ప్రకారం అర్హులకు హక్కుపత్రాలు ఇవ్వాలన్నారు.

సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య మాట్లాడుతూ అయినవోలు మండలం ఏర్పడి పదేళ్లవుతున్నా ప్రభుత్వ కార్యాలయాలు తహశీల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ, పోలీస్‌స్టేషన్ అద్దె భవనాల్లో ఉంటున్నాయన్నారు. అయినవోలు పోలీస్‌స్టేషన్‌కు శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలు వేసిన నిర్మాణం ప్రారంభించకపోవడం పాలకుల నిర్లక్ష్యమేనని లింగయ్య అన్నారు. వెంటనే ప్రభుత్వ కార్యాలయాలు స్థలం కేటాయించి నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు బండి పర్వతాలు, కుంకాల నారాయణరెడ్డి, దర్శనాల సంపత్, దీకొండ ఉప్పలయ్య, మడిగే నాగరాజు, గబ్బెట రామ్ కుమార్, బొమ్మ కంటి యాకయ్య, లింకల నరసయ్య, ఏసి రెడ్డి రాజిరెడ్డి, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ సామాజిక శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

- **కేవీపీఎస్ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి టీ.ఉప్పలయ్య**



నవతెలంగాణ-నయింనగర్

కేవీపీఎస్ తెలంగాణ రాష్ట్ర సామాజిక శిక్షణ తరగతులు చారిత్రాత్మక నగరమైన హన్మకొండలో నిర్వహిస్తున్నట్లు కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి టి .ఉప్పలయ్య తెలిపారు. హనుమకొండ రాంనగర్ లోని జిల్లా కార్యాలయంలో శనివారం కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఓరిగంటి సాంబయ్య అధ్యక్షతన జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు బలహీన వర్గాల హక్కుల కోసం నిర్విరామంగా పోరాడుతున్న కేవీపీఎస్ తెలంగాణ రాష్ట్ర సామాజిక శిక్షణ తరగతులు జయప్రదానికి జిల్లాలోని అన్నివర్గాల ప్రజలు, సంస్థలు సహకరించాలని కోరారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో నేటికీ కుల వివక్షత అంటరానితనం, వె లివేతలు సమాజంలో కొనసాగుతున్నాయని అన్నారు. రాజ్యాంగం లో ఆర్టికల్ 15, 17 లో కుల వివక్షత అంటరానితనం నిషేధించిన నేటికీ కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పౌర హక్కుల పరిరక్షణ చట్టంవచ్చిన దానిని అమలు చేయడంలో పాలకులు, అధికారులు విఫలం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశాన్ని పరిపాలించిన బిజెపి ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడంలో విఫలమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నిడిపార్ట్‌మెంట్లలో బ్యాక్‌లాగ్ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉంచుతున్నాయని తక్షణమే వాటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 67 రాష్ట్ర ప్రభుత్వరంగ ఉద్యోగాల్లో మాదిరిగానే బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను కూడా ఖాళీలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో 27 వేల బ్యాక్ లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటిని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే భర్తీ చేయాలని కోరారు. బిజెపి తన మతోన్మాద విధానాలతో తెలంగాణ రాష్ట్రంలో సష్టించి దొడ్డిదారిన అధికారం చేప ట్టాలని ప్రయత్నిస్తుందని, బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్లు లేకుండా వారు అభివృద్ధి చెందకుండా బానిసలుగా మార్చేందుకు ప్రయత్నం చేస్తుందని, అలాంటి ప్రయత్నాన్ని కెవిపిఎస్ శ్రేణు లు విస్తృతంగా ప్రచారం చేసి పోరాడాలని పిలుపునిచ్చారు.

విద్యార్థి, యువజన సమస్యలపై పోరాటం : మంద సంపత్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి

మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్ లు విడుదల చేయాలని పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, పక్క భవనాలు నిర్మించాలని పాఠశాలలకు ఉపాధ్యాయుల నియమించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మంద సంపత్ కోరారు. విద్యాసంస్థల సమస్యలు వెలికి తీయుటకు కెవిపిఎస్ సర్వే చేస్తుందని, హనుమకొండ జిల్లాలోని అన్ని దళితవాడలో సర్వేలు చేసి దళితుల సమస్యలపై అధ్యయనం చేసి సమస్యల పరిష్కారానికి కెవిపిఎస్ నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సామాజిక శిక్షణ తరగతుల ద్వారా భవిష్యత్తులో సామాజిక హక్కుల సాధన కోసం జరిగే పోరాటాలు మరింత ముందుకు వెళ్లేందుకు దోహదపడనున్నాయని తెలిపారు. కావున వీటి జయప్రదానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దూడపాక రాజేందర్, ముదుసు నారాయణ, గబ్బెట రామ్‌కుమార్, సహాయ కార్యదర్శిలు దానబోయిన రాంబాబు, గడ్డం అశోక్, జిల్లా నాయకులు బొట్ల కుమార్, హర్షం రామ్ కి, రేనుకుంట్ల చందర్, శనిగరం జనార్దన్, శీలంశీను, కోడెపాక సదానందం, జన్ను బాబు, జ్యోత్స్న, విజయ, సుకర్ణ, జ్యోతి, కుమ్మరి రవి, బొక్కల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన మహిళపై కేసు

నవతెలంగాణ-శాయంపేట

జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది, పరకాల ఎక్సైజ్ సిబ్బంది పక్కా సమాచారం మేరకు గుడుంబా స్థావరంపై దాడి నిర్వహించి వ్యక్తిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయబోగా ఎక్సైజ్ కానిస్టేబుల్ యూనిఫామ్ చొక్కాపట్టుకొని లాగి, పోలీసు విధులకు ఆటంకం కలిగించిన మహిళ జర్పుల జ్యోతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిహెచ్.ప్రమోద్ కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం మండలంలోని సూర్యానాయక్ తండ గ్రామంలోని జర్పుల జ్యోతి ఇంటివద్ద నాటు సారా తయారు చేస్తున్నారని పక్కా సమాచారం మేరకు బుధవారం ఉదయం పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ, జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్‌ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో గాలింపు చర్య చేపట్టబోగా, అక్కడే ఉన్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నం చేసినట్లు తెలిపారు. సిబ్బంది సహాయంతో అతన్ని పట్టుకొని విచారించగా నాటు సారా తయారీకి షుగర్ పానకం నిలువ ఉన్నదని చెప్పడంతో, ఆ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని వెళ్లే ప్రయత్నంలో జర్పుల జ్యోతి అక్కడికి చేరుకొని ఎక్సైజ్ పోలీస్ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ వరుణ్ రెడ్డి యూనిఫామ్ చొక్కా పట్టుకొనిలాగి ఆమె కొడుకుని అదుపులోకి తీసుకోకుండా పోలీస్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించినట్లు తెలిపారు.

ఎక్సైజ్ సీఐ తాతాజీ ఫిర్యాదు మేరకు పోలీసు విధులకు ఆటంకం కలిగించిన జర్పుల జ్యోతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపారు.

49వ డివిజన్‌లో ఉచిత వైద్య పరీక్షలు



నవతెలంగాణ-సుబేదారి

49డివిజన్ లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించామని కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ తెలిపారు. శని,ఆదివారాలు రెండు రోజులు పాటు జులైవాడ ఆటోస్టాండ్ దగ్గర కార్మికశాఖ ఆధ్వర్యంలో లేబర్ కార్డు కలిగి ఉన్న కార్మికులకూ ఉచితం గా వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆదివారం ఉదయం 8 సాయంత్రం 6 వరకు లేబర్‌కార్డ్ కలిగి ఉన్న ప్రతి ఒక్క కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని కార్పొరేటర్ తెలిపారు. వైద్యశిబిరాలను డివిజన్‌లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఏ అసోసియేషన్ సభ్యులుగా పివి.నారాయణరావు



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్‌గా నాలుగు దశబ్దాలపైన సేవలను అందిస్తున్న సిఏ పివి.నారాయణరావు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ట్యాక్స్‌బార్ అసోసియేషన్ పాలక మండలి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు బొజ్జా మధుసూదన్ నారాయణరావును అభినందించారు. సంస్థ సభ్యుల కోసం సాగిస్తున్న కృషిని గుర్తిస్తూ సభ్యుల సంక్షే మం, ఐక్యతకోసం సేవలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకొనగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఏ నారాయణరావు మాట్లాడుతూసభ్యుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషిచేస్తానని తనకు సహకరించిన వారందరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులపై వేధింపులను అరికట్టేందుకు కృషి చేయాలి

- **వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు**



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

వృద్ధులపై వేధింపులను అరికట్టేందుకు ప్రతీఒక్కరు కంకణబద్దులై పనిచేయాలని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. శనివారం మడికొండలోని రైతువేదికలో సీనియర్ సిటీజన్ వెల్ఫేర్ అసోసియేషన్ గోపాలపురం ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించగా ఎమ్మెల్యే నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వృద్ధుల భద్రత, శ్రేయస్సును పెంచడంలో సహాయపడే వనరుల సేవలను, వారిపట్ల ఎక్కువ చూపేలా ప్రోత్సహించడమే ఈ అవగాహన దినోత్సవం లక్ష్యం అన్నారు. తనపై పాటను రాసి పాడిన అభిమానిని ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యేని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిఎస్పీ దామెర నర్సయ్య, సిడిపిఓ మధురిమ, సూపర్వైజర్ రాజ్యలక్ష్మి, మడికొండ సీఐ ప్రతాప్, మెట్టుగుట్ట దేవస్థాన చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాంగ్రెస్‌నాయకులు,కార్యకర్తలు సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

చేనేత సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతి



నవతెలంగాణ-శాయంపేట

మండల కేంద్రంలోని చేనేత సొసైటీలో నిల్వ ఉన్న వస్త్రాలను తక్షణమే కొనుగోలు చేయాలని, టెస్కో కొనుగోలు చేసిన వస్త్రాల బిల్లులను, కార్మికుల బిల్లులను విడుదల చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, రాష్ట్రవ్యవసాయ, చేనేత,సహకార మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో శనివారం మంత్రి తుమ్మల ను ఎమ్మెల్యే జీఎస్ఆర్ మర్యాదపూర్వకంగా కలిసి చేనేతసొసైటీలో నెలకొన్న సమస్యలను విన్నవించగా మంత్రి తుమ్మల సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తానని మంత్రి తుమ్మల హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, ఎస్ఎస్ఆర్ అధినేత సంపత్‌రావు, నాయకులు గండ్ర సత్యనారాయణరెడ్డి, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు నియంత్రణ జీవోలను తుంగలో తొక్కుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలు

- **డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి**



నవతెలంగాణ-నయింనగర్

ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణపై ప్రభుత్వానికి పట్టింపులేదని, ఫీజుల దోపిడీని అరికట్టాలని ఈ నెల 19న కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నా కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ రాంనగర్, సుందరయ్య భవన్‌లో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నోముల కిషోర్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశం లో తిరుపతి మాట్లాడుతూ. ప్రైవేటు విద్యాసంస్థలు ప్రతీ సంవత్సరం 30 నుంచి 40 శాతం ఫీజులు పెంచుతున్నారని, ఫీజుల నియంత్రణ కోసం ప్రభుత్వం జీవోలు చేసిన ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు పాటించకుండా తుంగలోకి తొక్కి వేశారన్నారు. విద్యపేరుతో వ్యాపారం చేస్తూ, విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల పట్ల ప్రభుత్వ ఉదాసీనతగా వ్యవహరిస్తుందని. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయిందని . పుస్తకాలు, నోట్‌బుక్స్, షూ, టై, బెల్ట్ అమ్ముకునే ఆధునిక దుకాణాలుగా మారాయన్నారు. ఫీజుల రెగ్యులేషన్ కోసం కమిటీ ఏర్పాటు చేసిన దాని నివేదికను అమలు పరచడం లేదని. ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ కోసం చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద సురేష్,ఓర్సుచిరంజీవి, జిల్లా నాయకులు శివరాత్రి కరుణాకర్, సముద్రాల అనిల్, మదన్ చారి, శంకర్, వెంకట్, ఉమారాణి, శివాజీ, యం.వరుణ్, పద్మ శైలజ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది లైన్‌లపై అప్రమత్తంగా ఉండాలి

- **విద్యుత్ డీఈ అంగోతు రాజన్న**



నవతెలంగాణ-హసన్‌పర్తి

విద్యుత్ సిబ్బంది లైన్‌లపై పని చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ డీఈ అంగోతు రాజన్న సిబ్బందికి సూచించారు. మండలంలోని చింతగట్టు విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో విద్యుత్ లైన్‌లపై పనిచేయునప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించవలసిన భద్రతా నియమాల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ సిబ్బందికి పలు సూచనలుచేశారు. సిబ్బంది విద్యుత్ లైన్‌లపై పనిచేయునప్పుడు సరియైన లైన్‌లో సరఫరా నిలిపివేసి నిలిపివేసిన లైన్‌లో సరఫరా లేదని నిర్ధారించుకొనుటకు తప్పని సరిగా ఎర్తింగ్ చేసుకొని మాత్రమే లైన్‌లపై పనిచేయాలని తెలిపారు. విద్యుత్ లైన్ అంతరాయం ఏర్పడినప్పుడు తప్పకుండా ఏ ప్రాంతంలో అంతరాయం ఏర్పడిందో ఆ ప్రాంతంలో నిత్యం ఎటువంటి సమస్య ఉత్పన్నమవుతుందో పూర్తిసమాచారం ముందస్తు తెలుసుకొని ఆ ప్రాంతంలో విద్యుత్ అంతరాయం లేకుండా త్వరితగతిన పూర్తి చేసే విధంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వినియోగదారుడు విద్యుత్‌లైన్‌లు తెగి పడినప్పుడు సమాచారం అందించిన వెంటనే ఆ ప్రాంతాన్ని సందర్శించి బారీ ప్రమాదం చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ప్రమాదాలు సంబవించినప్పుడు వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ రాంశెట్టి మౌనిక, చింతగట్టు టౌన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రదీప్‌కుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జనగామ
ఆదివారం | జూన్ 16, 2024 | www.navatelangana.com

తరగతి గదుల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించొద్దు

కలెక్టర్‌కు కౌన్సిలర్ వినతిపత్రం



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల్లోకి సెల్ ఫోన్లను అనుమతించొద్దని కోరుతూ 16వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రామచంద్రం శనివారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తరగతి గదుల్లో బోధించే సమయంలో కొందరు ఉపాధ్యాయులు సెల్ఫోన్ చూస్తూ నిద్ర పోతున్నారని, విద్యార్థులకు విద్యను బోధించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించేందుకు ఆసక్తి చూపడం లేదని పేర్కొన్నారు. తరగతి గదిలోకి వెళ్లే ముందు ఉపాధ్యాయులు తమ సెల్ ఫోన్లను ప్రధానోపాధ్యాయుని వద్ద పెట్టి వెళ్లాలని, ఆ మేరకు అన్ని పాఠశాలలకు ఉత్తర్వులు జారీ చేయాలని ఆ వినతిపత్రంలో కలెక్టర్‌ను కోరారు.

టాం కాం ఆధ్వర్యంలో జపాన్ లో ఉద్యోగాలు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్ కాబడ్డ ప్రభుత్వ రిక్రూట్మెంట్ ఏజెన్సీ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టాం కాం)ఆధ్వర్యంలో జపాన్ లోని ఆస్పత్రులలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి, శిక్షణ అధికారి ఉమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జపాన్లో స్పెసిఫైడ్స్ కిల్డ్ వర్కర్స్ కింద పని చేసేందుకు అర్హత కలిగిన నర్సింగ్ సిబ్బందికి శిక్షణ, నియామకం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని టాం కాం ద్వారా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే టాంకాం ద్వారా రెండు బ్యాచ్ల నర్సింగ్ అభ్యర్థులు 31 మంది శిక్షణ తీసుకుని జపాన్లోని ప్రసిద్ధ ఆసుపత్రులలో పనిచేస్తున్నారని, మూడో బ్యాచ్ నర్సింగ్ అభ్యర్థులు టాంకాం ద్వారా శిక్షణ తీసుకుంటున్నారని, జూన్ 20 తారీకులోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జపనీస్ భాషపై శిక్షణ, జపాన్‌లో పని చేయ డానికి అవసరమైన అదనపు వత్తిపరమైన నైపుణ్యాలు ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లో అందించ బడతాయని, అభ్యర్థులకు నెలకు లక్షన్నర నుండి లక్ష80వేల వరకు వేతనం పొందొచ్చని, తగిన విద్యార్హత, ఆసక్తి ఉన్న వారు 9951909863, 6302292450, 9573945684 సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలి

సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్

నవతెలంగాణ-జనగామ

ప్రైవేట్ పాఠశాలల, కళాశాలలో విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీపీఐ(ఎం) జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ డిమాండ్ చేశారు. . స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో కళ్యాణం లింగం అధ్యక్షతన నిర్వహించిన పట్టణ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జోగు ప్రకాష్ పాల్గొని మాట్లాడారు. జనగామ పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయన్నారు. ఫీజుల పేరుతో నర్సరీ నుండి బుక్స్, యూనిఫాం ప్రైవేటు స్కూల్లో ముందు అమ్మకాల దోపిడీ నిలిపి వేయాలని అన్నారు. ప్రైవేటు స్కూల్లో కాలేజీల ముందు ఫీజుల బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యాసంస్థలను నిర్వహించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థలను నిర్వహిస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ చొరవతో జిల్లాలో ఫీజుల నియంత్రణ కమిటీ ఏర్పాటు చేసి పేదల వద్ద ఫీజుల పేరిట చేస్తున్న దోపిడీని నియంత్రించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, వెంకటేష్ , దామెర అబ్రహం లింకన్, భూమాద్రి వెంకటేష్, మనీ, జయ, రజిత, సుధాకర్, స్వామి, పద్మ పాల్గొన్నారు.



భూముల కౌలు ద్వారా జీడికల్ ఆలయానికి ఆదాయం

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలంలోని జీడికల్ గ్రామంలో స్వయంభువుగా వెలసిన శ్రీ వీరాచల జిడికంటి శ్రీ రామచంద్రస్వామి దేవాలయం భూములకు శనివారం కౌలు వేలం పాట నిర్వహించగా 1,99,800 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈఓ వంశీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గుంటూరు జిల్లా వట్టిచెరుకూరి మండలం కార్నెపాడ్ గ్రామంలో 2024-25సంవత్సరంలో ఆరెకరాల 26 సెంట్లు భూమికి, 1,07,800రూపాయల మన్నవమార్ కొండయ్య, ఐదుఎకరాల 33సెంట్లు భూమికి 9,2000 రూపాయల మన్నవ రవిదేవరాజు కౌలు దక్కించుకున్నారు. గత ఏడాది కంటే తక్కువ వచ్చిందని, ఈ ఆదాయాన్ని ఆలయం అభివద్ధి కషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి గున్నం శ్రీనివాస్, జీడికల్ ఆలయం జూనియర్ అసిస్టెంట్ కెకె రాములు, సిబ్బంది కె మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

12 మంది ఎంపిక

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రైవేటు జాబ్‌మేళాలో 12మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించాయి. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్స్ (10), బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్స్ (10) మొత్తం 20 ఉద్యోగాలకు జరిగిన ఇంటర్వ్యూలకు 63 మంది అభ్యర్థులు హాజరైనట్లు జిల్లా ఉపాధి అధికారి ఉమారాణి తెలిపారు. ఇందులో అర్హతలను బట్టి 43 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి 12 మంది అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. ఈ జాబ్‌మేళాలో జిల్లా ఉపాధి శిక్షణ అధికారి ఉమారాణి, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వరంగల్ డివిజనల్ మేనేజర్ వినయ్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగడి వేలం 3.89 లక్షలు

నవతెలంగాణ-బచ్చన్నపేట

బచ్చన్నపేట మండల కేంద్రంలోని పశువుల అంగడి వేలం స్థానిక గ్రామ పంచాయతీ వద్ద ఎంపీడీవో రఘురామకష్ణ, స్పెషల్ ఆఫీసర్ వినోద్ కుమార్, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ వేలంలో మండల కేంద్రానికి చెందిన బొడిగం వెంకట్‌రెడ్డి రూ.3.89లక్షలకు వేలం దక్కించుకున్నారు. డక్క వేలం బసిరెడ్డిపల్లికి చెందిన తేలు అంజయ్య రూ. 16000/ దక్కించుకున్నారు. తైబజార్ వేలం వాయిదా పడినట్టు తెలిపారు.

కుటుంబ కలహాలతో వృద్ధుడు ఆత్మహత్య

నవతెలంగాణ-నర్మెట్ట

కుటుంబ కలహాలతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్మెట్ట మండలంలోని గుంటూరుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుపల్లి గ్రామానికి చెందిన జంజాల భీమయ్య (64) ఇద్దరు కొడుకులు. ఒక కూతురు ఉన్నారు. చిన్న కొడుకుకోడలు మధ్య గొడవలు జరిగి తన కోడలు అత్తగారింటికి వెళ్లిపోగా కొడుకు ఒక్కడే ఉంటున్నాడు. భూమయ్య ఆర్థికంగా లేకపోవడం వల్ల తన కూతురికి వివాహం చేయలేకపోతున్నాడు. వీటిని మనసులో పెట్టుకొని భూమయ్య మనస్థాపం చెంది శుక్రవారం అర్ధరాత్రి తన ఇంట్లో గడ్డి మందు తాగాడు. చికిత్స నిమిత్తం జనగామ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్టు హెడ్‌కానిస్టేబుల్ హిదాయత్ అలీ తెలిపారు. భూమయ్య భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

17న సదరం స్లాట్ బుకింగ్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ఈ నెల 17న సదరం స్లాట్ బుకింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివద్ధి అధికారి మొగులప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20, 27, 28 తేదీలలో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నందున జిల్లాలోని అన్ని మీసేవ కేంద్రాలలో 17వ తేదీన సదరం స్లాట్ బుకింగ్ అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి స్లాట్‌బుకింగ్ రూ.35 మాత్రమే చెల్లించాలని అంతకంటే ఎక్కువ రుసుము వసూలు చేస్తే సదరు నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. రెన్యూవల్ కు 100 స్లాట్సు, కొత్త వాటికి మరో 100 స్లాట్స్ మొత్తంగా 200 స్లాట్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. మీ సేవ ద్వారా స్లాట్ కు అర్హులైన వికలాంగులు డాక్టర్ రిపోర్ట్స్ తో ఆధార్ కార్డు, ఫోటో, మీ సేవ లో స్లాట్ బుకింగ్ చేసుకున్న రసీదులను వెంట తెచ్చుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే క్యాంపులకు హాజరు కావలసిందిగా విజ్ఞప్తి చేశారు.

గుడిసెలను తొలగిస్తే ప్రతిఘటిస్తాం

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి



నవతెలంగాణ-బచ్చన్నపేట

మండలంలోని చిన్న రాంచర్ల గ్రామ శివారులో గల 174 సర్వే నెంబర్ అసైన్డ్ భూమిలో ఇండ్లు లేని నిరుపేదలు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకుంటే పోలీసులు తొలగించేయత్నం చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పోలీసులు గుడిసెవాసులను భయభ్రాంతులకు గురి చేయడంతో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి గుడిసెలను తొలగిస్తే ఊరుకునేదేలేదని స్పష్టం చేశారు. అక్రమ అరెస్టులు, బెదిరింపులకు వెనక్కు తగ్గేదేలేదన్నారు. మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ఇల్లు లేని ప్రజలు వందలాదిగా తరలివచ్చి ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేస్తే ఈ గుడిసెలను తొలగించేందుకు పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. జనగామ ఏసిపి ఆధ్వర్యంలో స్పెషల్ ఫోర్స్‌తో పాటు సివిల్ పోలీసులు పెద్ద మొత్తంలో అక్కడికి చేరుకున్నారన్నారు. అణచివేతలతో భూ పోరాటాలను ఆపలేరని మోకు కనకారెడ్డి అన్నారు. మండల ఇన్చార్జి సుంచు సుంచు విజేందర్ మాట్లాడుతూ గుడిసెలు తొలగిస్తే భూ పోరాటం ముందుకు పోతది తప్ప వెనక్కు తగ్గదని వారు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ భూమిని ఆక్రమించుకున్న ప్రైవేటు వ్యక్తులకు సహకరిస్తూ ప్రభుత్వ భూమిని కాపాడడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, భూ సాధన కమిటీ కన్వీనర్ పర్వతం నర్సింలు, మండల కమిటీ సభ్యులు వెంకటవ్వ, భూ పోరాట కమిటీ కన్వీనర్ పర్వతం నరసింహులు, రవీందర్‌రెడ్డి, రాములు, రాజవ్వ, ఎల్లయ్య, ఈదమ్మ, శోభ, కరుణాకర్, బాలరాజు, యాదగిరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సింగరాజుపల్లిలో 132 కెవి సబ్ స్టేషన్ నిర్మాణానికి కృషి

ముత్తారం, మల్లంపల్లిలలో 32 కెవి సబ్ స్టేషన్ల ఏర్పాటు

లూజ్ లైన్ సమస్యలను పరిష్కరించాలి

విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చర్యలు

విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సమీక్ష



నవతెలంగాణ-పాలకుర్తి

పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల రైతులకు మరింత నాణ్యమైన విద్యుత్ అందించేందుకు దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో 132 కెవి సబ్ స్టేషన్ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం తొర్రూరు మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాలకుర్తి నియోజకవర్గస్థాయి విద్యుత్ అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ సింగరాజు పల్లి లో 132 కెవి సబ్ స్టేషన్ నిర్మాణానికి 25 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని, స్థలం పూర్తి వివరాలను అందించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. 132 కెవి సబ్ స్టేషన్ నిర్మాణం వల్ల పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల రైతులకు మరింత నాణ్యత గల విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు. పాలకుర్తి మండలంలో ముత్తారం, మల్లంపల్లి గ్రామాల్లో 32 కెవి సబ్ స్టేషన్ ల ఏర్పాటు కోసం విద్యుత్ అధికారులు ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి ప్రతిపాదనలను అందజేయడంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లూజ్ లైన్ల సమస్య ఎక్కువగా ఉందని రైతుల నుండి ఫిర్యాదులు అందుచున్నాయని తెలిపారు. లూజ్ లైన్ల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. లూజ్ లైన్లతో రైతులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్ల పట్ల ప్రత్యేక దష్టి పెట్టాలని, అవసరమైతే వాటిని మార్చాలని సూచించారు. పాలకుర్తి మండలం లోని తొర్రూరులో నిర్మాణంలో ఉన్న సబ్ స్టేషన్ పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖలో బిల్లులు పెండింగ్లో ఉన్నాయని విద్యుత్ శాఖ అధికారులు ఎమ్మెల్యే దష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నిధుల విడుదల కోసం ప్రభుత్వం దష్టికి తీసుకువెళతానన్నారు. విద్యుత్ అధికారులు రైతుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్త సబ్ స్టేషన్ల మంజూరు తో పాటు విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘన్పూర్ డి ఈ మాలోతు హుస్సేన్ నాయక్, పాలకుర్తి, దేవరుప్పుల ఏ డి ఏ లు బాల గంగాధర్ తిలక్, అనిల్ కుమార్, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల ఏఈలు ఆవిరినేని రణధీర్ రావు, రాములు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల ఘనపూర్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక





ఆరు నెలల్లో ప్రతి గ్రామానికి సాగు నీరు అందిస్తాం

సాగు, తాగునీరు, రోడ్లపై ప్రత్యేక కార్యాచరణ

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలంలోని ప్రతీ గ్రామానికి ఆరు నెలల్లో సాగు నీరు అందించే బాధ్యత తనదని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడారు. అమలు కానీ, చేయలేని హామీలు నేను ఇవ్వలేనని అన్నారు. ఘనపూర్, అశ్వరావుపల్లి రిజర్వాయర్ల నుండి వచ్చే యాసంగి లోపు అన్ని కాలువల మారమ్మత్తులు చేపట్టి ప్రతీ గ్రామానికి సాగు నీరు అందిస్తానని హామీ ఇచ్చారు. దేవాదుల ప్రాజెక్ట్ పెండింగ్ పనులను నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే దేవాదుల ప్రాజెక్టుపై సమీక్షా సమావేశం నిర్వహిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. మండలంలోని ముఖ్యమైన రోడ్లను జనగామ నుండి జీడికల్, జీడికల్ నుండి పల్లగూడ వయా గుమ్మడవల్లి, కోడూరు నుండి చీటూరు, సిరిపురం నుండి లింగాల ఘనపూర్, కిష్టపురం నుండి నెలపోగుల రోడ్లను పూర్తి చేసుకున్న తర్వాత మిగిలిన రోడ్లను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శివకుమార్, రమేష్, అనిల్, సంపత్, బాలరాజు, ఉపేందర్, మల్లేశం, కిషన్, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్భా, మాడల్ స్కూళ్లలో కడియం ఆకస్మిక తనిఖీ

మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ, మోడల్ స్కూళ్లను ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంట గదిని, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలలోని వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట గదిలోని బియ్యం, ఇతర సరుకులను పరిశీలించిన ఎమ్మెల్యే విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సంబంధిత వర్కర్లకు సూచించారు. అనంతరం పాఠశాలలలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దష్టికి తీసుకురావాలని ఉపాధ్యాయులకు చెప్పారు. కార్యక్రమం జడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి, మండల అధికారులు ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ముందు యువతి ఆత్మహత్యాయత్నం



నవతెలంగాణ-స్టేషన్ ఘనపూర్

ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలు బంధువులతో నిరసన చేపట్టి, పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్న సంఘటన జనగామ జిల్లా చిల్పూర్ మండలం రాజవరం గ్రామంలో చోటుచేసుకుంది. నాలుగేళ్లుగా ప్రేమాయణం సాగించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి....శారీరకంగా లోబరుచుకుని రెండు సార్లు గర్భవతిని చేసి అబార్షన్ చేయించి, పెళ్లి చేసుకుంటానని మొఖం చాటేశాడు. రాజవరం గ్రామానికి చెందిన గంగారపు వెంకటస్వామి చిన్న కుమారుడు గంగారపు క్రిష్ణ అనే యువకుడు, మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన చింతల కొమురయ్య కూతురు శ్రీలత ప్రేమించుకున్నారు. ఇద్దరూ హైద్రాబాద్‌లో ప్రయివేట్ ఉద్యోగాలు చేసుకుంటూ మౌలాలి హౌసింగ్ బోర్డు కాలనీలో ఓకె ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఈ క్రమంలో శ్రీలత పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తీసుకురావడంతో, రాజవరంలో తన ఇంటికి వెళ్ళొస్తానని చెప్పి అదే మండలం పల్లగుట్టకు చెందిన మరో అమ్మాయితో నిశ్చితార్థం చేసుకున్నాడని తెలుసుకున్న ప్రేమికురాలు, ప్రియుడి ఇంటి ముందు బంధువులతో తనకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టింది. ప్రియుడి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి ఆచూకీ లేకపోవడంతో మనస్థాపానికి గురైన బాధితురాలు తన వెంట తెచ్చుకున్న బ్యాగులోని పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకుంది. గమనించిన బంధువులు 108కి ఫోన్ చేయగా, ఆలస్యం అవుతుందనే, ప్రయివేట్ వాహనంలో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రియుడు కష్ణ కుటుంబంపై తగిన చర్యలు తీసుకొని, న్యాయం చేయాలని బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

వేతనాలు చెల్లించాలని జీపీ కార్మికుల నిరసన



నవతెలంగాణ-స్టేషన్ ఘనపూర్

రెండు నెలలుగా తమకు జీవితాలు ఇవ్వడంలేదని, వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత రెండు నెలలుగా తమకు వేతనాలు సక్రమంగా రావడం లేదని, గ్రామ పంచాయితీ కార్యదర్శిని పలుమార్లు విన్నవించినా పై అధికారులకు నివేదిక పంపామని చెబుతూ కాలం వెల్లదీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు వేతనాలు విషయంలో మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోసు రాజేంద్ర ప్రసాద్, కుంభం రాజు, చంద్రమౌళి, శ్రీను, రాజు, వెంకటయ్య స్వరూప, కోమల, సారయ్య, ప్రమోద్, రమేష్, గజెందర్, విజయ్, వెంకట స్వామి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజులను నియంత్రించాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదాల్ల శరత్

నవతెలంగాణ-వరంగల్

ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులను నియంత్రించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదాల్ల శరత్ అన్నారు.శనివారం మండల కేంద్రంలో ఉన్న విద్యా వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి విజయ్‌కుమార్‌కు అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఈ సందర్భంగా ల్యాదాల్ల శరత్ మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నా రు. కొన్ని పాఠశాలలకు స్కూలు కాంపౌండ్ లేని పరిస్థితులు ఉన్నాయని అలాంటి పాఠశాలను గుర్తించి స్కూల్ కాంపౌండ్ వాల్ వెంటనే మంజూరి చేసి పనులు ప్రారంభించాలన్నారు. దాంతో పాటు మండల కేంద్రంలోని అనుమతి లేని ప్రైవేట్, కార్పొ రేట్ పాఠశాలలను సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మౌటం శివ కుమార్, సంతోష్, మేకల అభిరా మ్, ప్రభాస్, రాజు, సాయి పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-చెన్నారావుపేట

మండల కేంద్రానికి చెందిన కుసుమ జ్యోతి (33)ఇటీవల అనారోగ్యంతో మతి చెందగా శనివారం ఆర్థికసాయం అందించారు. ఇదే గ్రామానికి చెందిన పద్మశాలి మహిళా పొదుపు సంఘం మహిళలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.8వేలు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు పరిషత్ స్వప్న సరిత కందకట్ల అరుణ, చంద్రకళ కుసుమ, ఆమని, గోరంట్ల రజిత, ముల్కా ఉమా స్వరూప ,తదితరులు పాల్గొన్నారు.



అనాధ పిల్లలకు ఆర్థికసాయం

నవతెలంగాణ-కాశిబుగ్గ

తల్లిదండ్రులు లేని అనాధ పిల్లలకు బొల్లం శివ మానవతా దక్పథంతో శనివారం రూ.10వేలు ఆర్థికసాయం అందించి ఆదుకున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం కాశిబుగ్గకు చెందిన సాయిఅద్విత్, శాన్వి తల్లిదండ్రులు లేకపోవడంతో తమ అమ్మమ్మ జ్యోతి వద్ద నివసిస్తున్నారు. పరిస్థితి తెలిసినా మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు శనివారం బొల్లం శివ, అద్విత్ షాన్విలను కాశిబుగ్గలోని నేషనల్ హై స్కూల్ సిలువేరు శీను, నేషనల్ హై స్కూల్ చైర్మన్ దూలం పవన్‌తో మాట్లాడి పాఠశాలలో జాయిన్ చేశారు.

సాహితీవేత్త శ్రీరంగ స్వామి సతీమణి మృతి

నవతెలంగాణ-హసన్‌పర్తి

ప్రముఖ సాహితీ వేత్త, శ్రీలేఖ సాహితీ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ టి.శ్రీరంగస్వామి సతీమణి తిరువళ్ళూరు శ్రీలక్ష్మి శనివారం తెల్లవారు జామున 1 గంట ప్రాంతంలో మరణించారు. హసన్‌పర్తి తహశీల్దారు కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్న శ్రీలక్ష్మి గుండెపోటు రావడంతో మృతి చెందారు. కాగా ఆమె భర్త శ్రీరంగస్వామికి నేత్ర దానంపై అవగాహన ఉండడంతో సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవన్ కుమార్‌ను సంప్రదించగా ఎల్వీపి టెక్నీషియన్ లక్ష్మణ్ సహకారంతో నేత్ర సేకరణ చేసి హైదరాబాద్ ఐ బ్యాంకుకు పంపించారు. శ్రీలక్ష్మి మతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. నిరంతరం శ్రీరంగస్వామి సాహిత్య సేవలో ఎంతో చేదోడువాదుడుగా ఉండేవారని, ఎందరో సాహితీ మిత్రులకు ఆత్మీయులని పలువురు తెలిపారు. ఆమె మతి పట్ల అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నిధి, పల్లేరు వీరస్వామి సంతాపం తెలిపారు. ఎందరో సాహితీ మిత్రులకు ఆప్యాయతతో అతిథ్యం అందించి, దూర ప్రాంతాల వారికి తమ ఇంటిలో ఆశ్రయం కల్పించారని, శ్రీలక్ష్మి మరణం పట్ల అరసం వరంగల్ కార్యవర్గం తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నదని పేర్కొన్నారు. శ్రీరంగస్వామికి పలువురు సాహితీవేత్తలు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా శ్రీలక్ష్మీ అంత్యక్రియలు రేపు ఆదివారం నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.

పిడుగుపాటుకు మరణించిన కుటుంబానికి పరిహారం అందేదెప్పుడో...!

నవతెలంగాణ-శాయంపేట

పిడుగుపాటుకు మహిళా రైతు దుర్మరణం చెంది 22 నెలలు కావస్తున్న ప్రభుత్వం నుండి ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిహారం చెల్లించి ఆదుకోవాలని మాజీ సర్పంచ్ అబ్బు ప్రకాశ్ రెడ్డి కోరారు. మండలంలోని పెద్దకోడపాక గ్రామానికి చెందిన చందా రాజయ్య - రమ దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రాజయ్య ఆర్టీసీ డ్రైవర్ గా కూడా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కాగా, ఇద్దరు కుమార్తెలకు వివాహం జరిపించారు. రమ తమకున్న ఎకరం 38 గుంటలలో వరిపంట సాగు చేస్తూ, పొలం పనులు చేస్తుండగా 2022 సెప్టెంబర్ 10న పిడుగు పడడంతో పంటక్షేత్రంలో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. దీనిపై బాధిత కుటుంబ సభ్యులు ప్రకృతి విపత్తు కింద పిడుగుపాటుకు మరణించిన రమకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు 22 నెలలు గడిచినప్పటికీ, ముగ్గురు జిల్లా కలెక్టర్లు మారినప్పటికి, ఆ కుటుంబానికి ఎలాంటి పరిహారం అందలేదు. పరిహారం కోసం బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక చొరవ తీసుకొని రమ కుటుంబానికి పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

విద్యారంగంలో సమూల మార్పులకోసం విద్యాకమిషన్ ఏర్పాటు

పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

విద్యారంగంలో సమూల మార్పుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో విద్యాకమిషన్ ఏర్పాటు చేయనున్నట్టు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని హరిపిరాలలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థి విద్యార్థినీలకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మొట్ట మొదటి సారిగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే పిల్లలకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేసిన చరిత్ర ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాల కల్పనకు అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటు చేశామని, త్వరలోనే విద్యా కమిషన్ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టబోతున్న సీఎం రేవంత్ రెడ్డి కి అభినందనలు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరేవిధంగా బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేవిధంగా ఉపాధ్యాయులు చొరవ చూపించాలని, ఆ దిశగా విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాల మీద భరోసా కల్పించాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మంగళపెల్లి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, చైర్మన్ హరి ప్రసాదరావు, ఎంపీటీసీ వల్లపు గోపమ్మ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంతోష్, పట్టణ పార్టీ అధ్యక్షులు సోమ రాజశేఖర్, ఎంపీడీవో శీలార్ సాహెబ్, ఎంఈఓ రాములు, నోడల్ ఆఫీసర్ బుచ్చయ్య, హెచ్ఎం డి.వెంకటేశ్వర రావు, అనురాధ, ఏపీసీ చైర్మన్ మల్లీశ్వరిలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

నవతెలంగాణ-మహబూబాబాద్



మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు తోట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ముందు ధర్నా నిర్వహించి కమిషనర్ నోముల రవీందర్‌యాదవ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తోట శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా యూనియన్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్లలో మున్సిపాలిటీలలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎమ్ఆర్, ఫిక్స్‌డ్‌పే తదితర పద్ధతిలో ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారని వారికి జీవో నెంబర్ 60, 63 ప్రకారం కేటగిరి వారి గా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కృష్ణ, కాగితపు శ్రీను, ఆకారపు విజయ్, పుచ్చకాయల ఎల్లయ్య, ఆవుల వెంకన్న, రజిని కుమార్, జి. పుష్పరాజ్ పాల్గొన్నారు.

గిరిజన బాలికను హత్య చేసిన వారిని శిక్షించాలి

నవతెలంగాణ-మరిపెడ



మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడి హత్యచేసిన దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి హరినాయక్ అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మీతండాలో బాధిత కుటుంబాన్ని గిరిజన సంఘం నాయకులు హరినాయక, కిషన్‌లు పరామర్శించారు. మియాపూర్ పరిధిలోని ఏటిగడ్డతండా వద్ద నివాసం ఉంటున్న మైనర్ బాలికపై పైశాచికంగా దాడికి పాల్పడడం హేయమన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వంఆర్థికంగా ఆదుకొని దుండగులను తక్షణమే పట్టుకొని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని దానికి పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ పరామర్శలో నాయకులు కిషన్ నాయక్ దేవానాయక్, అనిత, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

గుడి కన్నా బడిగొప్పది

నవతెలంగాణ-మహబూబాబాద్

భావి భారత పౌరులను ఉన్నత లక్ష్యాల వైపు తీర్చిదిద్దే బడి గుడి కన్నా గొప్పదని అమనగల్ పాఠశాల ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాలలో నూతనంగా ప్రైవేటు పాఠశాల నుండి ఒకేరోజు 30 మంది చేరారు. ఈ సందర్భంగా హెచ్ఎం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు మాత్రమే ట్రిబుల్ ఐటీలో ప్రవేశం పొందుతున్నారని, మనోవైజ్ఞానిక శాస్త్ర ప్రకారంగా ఒకటి నుంచి 10వతరగతి వరకు తల్లిదండ్రుల వద్ద ఉండే చదువుకోవాలని, అలా చదివిన పిల్లలే మానవీయ కోణంలో ఆలోచిస్తారని, అన్నారు ఈ కార్యక్రమంలో హెచ్ఎం సత్యశంకర్, డానియల్, ఎండి.పాహిం, శశిధర్, పి.జనార్ధన్, బలాస్టి రమేష్, కే.యుగేందర్, బాలాజీ, ఎం.శ్రీనివాస్, ఏ. రామాచారి, ఎండి.ఉస్మాన్, షమీం, హైమ, అరుణ పాల్గొన్నారు.

వృద్ధులను చులకనగా చూడవద్దు

నవతెలంగాణ-తొర్రూరు



వృద్ధులను చులకనగా చూడకూడదు అని సీనియర్ సిటిజన్ డివిజన్ అధ్యక్షులు వంగపల్లి రాజలింగం అన్నారు. శనివారం వయోవృద్ధుల అవగాహన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో సీనియర్ సిటిజెన్ ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన డివిజన్ అధ్యక్షులు వంగపల్లి రాజలింగం మాట్లాడుతూ వద్దులను చులకన చూడడం, హేలన చేయడం, వేధించడంలాంటి సంఘటనలు దృష్టికి వచ్చినప్పుడు వారికీ మేమున్నాం అని భరోసా కల్పించవలసిన అవసరం ఉందని, వేధింపులకు గురి చెసినచో ఆర్డీవో దృష్టికి తీసుకొనివెల్లి సమస్యను పరిష్కారం చేయుటకు కార్యవర్గ సభ్యులందరు చొరవ చూపాలని కోరారు. ఈ నెల 19న మండల కేంద్రంలో ర్యాలీ తీయుట జరుగుతుందని తెలిపారు.

ఈ సమావేశంలో ఉల్లి విశ్వనాధచారి, రాజలింగం, కాటి ఉపేందర్, నర్సయ్య, కోటయ్య, ఇట్టెసోమారెడ్డి, ఎండి.యాకూబ్, వెంకట్ రెడ్డి, ఉమ్మడి రాంబాబు, వీరభద్రం, కప్పల సోమయ్య, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతికి నేతల నివాళి

నవతెలంగాణ-ఇనుగుర్తి



మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ దీకొండ ఐలయ్య శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ గండు సావిత్రమ్మ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి విజయ్ సారథి, బండి పుల్లయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూరెల్లి సతీష్ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం చెప్పారు. భౌతికకాయం సందర్శించిన వారిలో జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్ రెడ్డి, కేసముద్రం మండల పార్టీ అధ్యక్షులు నజీర్ అహ్మద్, టిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు భేతమల్ల చంద్రయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఎలక్షన్ కో-ఆర్డినేటర్ తమ్మడపల్లి కుమార్, గుజ్జు నూరి బాబురావు, చిన్నాల కట్టయ్య, సమ్మీ గౌడ్, మాజీ సర్పంచ్లు ధార్లరామ్మూర్తి, మామిడి శోభన్, జాటోత్ హరిచంద్, బానోత్ రామన్న, గండు రాజు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

వేంకటేశ్వర ఎస్‌హెచ్‌జీకి రాష్ట్రస్థాయి అవార్డు

నవతెలంగాణ-నెల్లికుదురు



మండలంలోని చిన్నముప్పారం శ్రీ వెంకటేశ్వర గ్రామైక్య సంఘానికి రాష్ట్రస్థాయి ఉత్తమ సంఘంగా అవార్డు లభించిందని ఏపీఎం వరదయ్య తెలిపారు. రాష్ట్రస్థాయిలో బ్యాంకు లింకేజీలో ప్రథమ స్థానంలో నిలిచిన ముప్పారం శ్రీ వెంకటేశ్వర గ్రామైక్య సంఘంకు కేసముద్రం యూనియన్ బ్యాంక్ రూ.3.50కోట్లు రుణం అందించడంతో అవార్డును ప్రిన్సిపాల్ సెక్రటరీ సందీప్ సుల్తానా, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో బ్యాంకు లింకేజీ డిపిఎం గడ్డం శ్రీనివాస్ గౌడ్, ఏపీడి జయశ్రీ, మండల సమైక్య అధ్యక్షురాలు పెరుమాళ్ళ కవిత, గ్రామ సంఘం అధ్యక్షురాలు మల్లం శారద, సీసీ బుర్ర రామానుజన్, వివోఏ రాయలి కవిత తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో ప్రయాణీకుల బెంబేలు



- ఆర్టీసీ బస్టాండ్‌లో పేట్రేగిపోతున్న దొంగల ముఠా
- పనిచేయని సీసీ కెమెరాలు - పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-తొర్రూరు

తొర్రూరు ఆర్టీసీ బస్టాండ్ చోరీలకు నిలయంగా మారిందా అంటే అవుననే స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ బస్సులు ఎక్కాలంటేనే ఏ బ్యాగులో నుంచి ఏ వస్తువు చోరీ చేస్తారో.. ఎవరి జేబులో నుంచి ఎంత నగదు మాయమవుతుందో.. ఎవరి పర్సు, సెల్ ఫోన్ కొట్టేస్తారో..అనేభయం ప్రయాణికులను వెంటాడుతోంది. ఆర్టీసీ బస్టాండ్లో సీసీ కెమెరాలు ఉన్నా....అవి మాత్రం నిద్ర వ్యవస్థలో ఉన్నాయని తెలుసుకున్న దొంగలు వారి చేతికి పని చెప్పారు. ఇక్కడ సెల్ ఫోన్లు,బంగారు,డబ్బులు చోరీకావడం నిత్యకృత్యంగా మారింది. గత రెండురోజులుగా వరంగల్ ప్లాట్‌ఫాం వద్ద బస్సు ఎక్కే క్రమంలో ఏకంగా నలుగురి సెల్‌ఫోన్స్ కొట్టేశా రు. అదేవిధంగా గురువారం మళ్లీ అదేచోరీ పునరావృతమైంది. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌లో బస్సులు ఎక్కాలంటేనే భయపడుతున్నారు. కానీ దొంగలేవరో కనిపెట్టాల్సిన సీసీ కెమెరాలు మాత్రం పనిచేయడం లేదు.దీంతో ఎవరు కొట్టేసారో తెలుసుకోవడం పోలీసులకు గండంగా మారింది. తొర్రూర్ ఆర్టీసీ బస్టాండ్ లో సెల్ ఫోన్లు వరుసగా మాయమైతున్న ఆర్టీసీ అధికారులు మాత్రం ఏమి తెలియనట్టు చూస్తున్నారు. బస్టాండ్‌లో సీసీ కెమెరాలు నిర్వాహణలో వెనుకడుగువేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి తొర్రూర్ ఆర్టీసీ బస్టాండ్ లో సీసీ కెమెరాల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నేరాల అదుపునకు కీలకంగా మారిన సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజాప్రతినిధులు, దాతలు, వ్యాపారులు ఇతర సంస్థల సహకారంతో తొర్రూరు ఆర్టీసీ బస్టాండ్ లో వీటిని ఏర్పాటు చేశారు.ఆర్టీసీ బస్టాండ్‌లో అనుసంధానం చేసి నిరంతరం వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. మొదట్లో బాగానే పని చేసినా నిర్వహణ, మరమ్మతులు సమస్యగా మారింది. వాటి పనితీరును పర్యవేక్షణ, పరిశీలించేందుకు ప్రత్యేక సిబ్బందిగాని, నిధులను కేటాయించలేదు. ఉన్న సీసీ కెమెరాల్లో ఏవి పనిచేస్తున్నాయో లేవో అనికూడా తెలియని పరిస్థితి నెలకొంది. పది, పదిహేను కెమెరాలకు అనుసంధానం ఉన్న వైర్లలో ఏ ఒక్క కెమెరా దగ్గర ఉన్న వైరుతెగినా మిగతావి పనిచేయకుండా పోతున్నాయి.

కీలక సమయాల్లో పనిచేయని నిఘా నేత్రాలు

ఏదైనా నేరం, ఘటన, ప్రమాదం జరిగిన ప్రాంతంలో కెమెరాలు ఉన్నప్పటికీ అవి పనిచేయకపోవడం ఆధారాలు, సాక్ష్యాలు లభించక నిందితులను పోలీసులు గుర్తించలేకపోతున్నారు. ఇటీవల చోరీలు,సెల్ ఫోన్స్ ఇతర సొత్తు అపహరణ కేసులు ఎక్కువగా నమోదవుతుండటంతో సీసీ కెమెరాల మరమ్మతుల కారణంగా కొన్ని కేసుల్లో వేగంగా దర్యాప్తు, విచారణ సాగడం లేదని అధికారులు అభిప్రాయపడుతున్నారు. కీలక సమయాల్లో సీసీ కెమెరాల్లో నిక్షిప్తంగా కాని నిందితుల గుర్తింపు కష్టతరంగా మారింది.

నిర్వహణ సరిగాచేయడం లేదు : కూచిపూడి జగదీష్, ఎస్సై తొర్రూరు



తొర్రూర్ బస్టాండ్ లో సీసీ కెమెరాలు నిర్వాహణలో డిపో మేనేజర్ కు పలుమార్లు మేము వివరణ ఇవ్వడం జరిగింది. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి చాలా రోజులు అవుతున్నాయి కావున దీని పరంగా సర్వీసింగ్ చేసే విధంగా చూడాలని డిపో మేనేజర్ కు లెటర్ కూడా ఇవ్వడం జరిగింది.అయిన కూడా ఆర్టీసీ అధికారులు స్పందించడం లేదు.

సీసీ కెమెరాలు పోలీసుల బాధ్యత : పద్మావతి, డిపో మేనేజర్ తొర్రూరు



తొర్రూర్ ఆర్టీసి బస్టాండ్ లో సెల్ ఫోన్ల దొంగతనాలు జరుగుతున్నాయని మా దష్టికి వచ్చింది. కానీ ఆర్టీసీ బస్టాండ్‌లో అమర్చిన సీసీ కెమెరాలు పోలీసు అధికారుల పర్యవేక్షణ లోనే ఉన్నాయి. వాటి గురించి మాకు ఎటువంటి సమాచారం గానీ లేదు. సీసీ కెమెరాలు రికార్డింగ్ పోలీస్ స్టేషన్లోనే అవుతుంది. ఇట్టి విషయంపై మేము కూడా స్పందించి చర్యలు తీసుకుంటాము. అదేవిధంగా ఇంకా ఆరు కెమెరాలు అమర్చడానికి మేము ఎండికి లెటర్ పెట్టుకున్నాము. త్వరలోనే అవి కూడా మంజూరు కాగానే కెమెరాలను బస్టాండ్లో అమర్చుతాము..

జీపీ సిబ్బందికి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- సీఐటీయూ నేతలు వెంకటయ్య, కుంట ఉపేందర్
- కలెక్టరేట్ వద్ద గ్రామ పంచాయతీ వర్కర్ల ధర్నా



నవతెలంగాణ-మహబూబాబాద్

18 నెలలుగా గ్రామపంచాయితీ సిబ్బందికి వేతనాలు చెల్లించకపోవడం దారుణమని వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని లేనియెడల పోరాటాన్ని ఉధతం చేస్తామని జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ హెచ్చరించారు. శనివారం గ్రామపంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్ వేతనాలు చెల్లించాలని జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి వారు మాట్లాడుతూ జిల్లాలో అనేక గ్రామపంచాయితీలల్లో గత 18 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని దీంతో కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా అవస్థలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వేతనాల విడుదల పట్ల ప్రభుత్వం స్పందించింకపోతే వివిధ రూపాల్లో పోరాటాన్ని మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, మల్టిపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, పిఆర్సీ పరిధిలోకి పంచాయితీ సిబ్బందిని తేవాలని, గత సమ్మె సందర్భంగా విడుదల చేసిన సర్క్యులర్ లోని అంశాలకు విధి విధానాలు ప్రకటించి అమలు చేయాలని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేరుతో ఉన్న గుర్తింపు కార్డులు రద్దు చేసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. అనంతరం డిపీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా నాయకులు సమ్మెట రాజమౌళి, కుమ్మరి కుంట్ల నాగన్న, యూనియన్ జిల్లా కార్యదర్శి బండ్ల అప్పిరెడ్డి, సుధాకర్, మొయి నుద్దీన్, లతీఫ్, వెంకన్న, యాకయ్య, జాన్ మియా, కనకలక్ష్మి, శిరీష, చంద్రకళ, వెంకటేశ్వర్లు, సురేష్, వీరన్న, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-గంగారం



జిల్లాలోని ఏజెన్సీ మండలాలైనా కొత్తగూడ, గంగారం మండలాలలోని పిహెచ్‌సీ, ఎంపీపీఎస్ స్పోర్ట్స్ స్కూల్, తహశీల్దార్ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకస్మికంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండలాలలోని వివిధ రికార్డులను సిబ్బంది నిర్వహిస్తున్న విధులను పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యులు అంకిత భావంతో పనిచేస్తూ మెరుగైన వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు.తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులు పరిశీ లించారు. కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు మెరుగైన సేవలందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇతరత్రా భూసమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-మరిపెడ



విద్యుత్ ప్రమాదాల పట్ల సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ, ప్రజలు, జంతువుల ప్రాణాలు రక్షించేందుకు అప్రమత్తంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రమాదాల నివారణ కోసమే అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని విద్యుత్ శాఖ మహబూబాబాద్ టెక్నికల్ డిఈ సునీత అన్నారు. శనివారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రమాద నివారణ వారో త్స వాల్లో భాగంగా మరిపెడ విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందికి అలాగే గాలివారిగూడెం గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. తగిన సూచనలు చేశారు.దగ్గరలో కాని, మీ ఇంట్లో గాని, పొలాల వద్ద గాని, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తీగలను ముట్టుకోవద్దన్నారు. ముఖ్యంగా బట్టలు ఆరేసే దండెంలకు విద్యుత్ వైర్లు తాకకుండా చూసుకోండి, విద్యుత్ ప్రవహిస్తున్న వైర్లకు ఎలాంటి అతుకులు లేకుండా చూసుకోండి, ఒక వేళ అలాంటి అతుకులున్న వైర్లను వెంటనే అనుభవం ఉన్న ఎలక్ట్రీషియన్‌తో సరిచేయించాలన్నారు. ఆరుబయట ఉన్న విద్యుత్ స్తంభాలను తాకావద్దని, పశువులను స్తంబాలకు కట్టకూడదని,వర్షంలో రైతులు ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి వెళ్లవడవద్దని, మీ స్టార్టర్ డబ్బాలను నీటిలో తడవకుండా పైకి ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ సబ్ డివిజన్ ఎడిఈ లోక్ నాద్ రెడ్డి, ఏఈ పావని, సబ్ ఇంజనీర్ మహమూద్, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్, లైన్ ఇన్స్పెక్టర్, లైన్ మెన్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

నవతెలంగాణ-పెద్దవంగర



విద్యార్థులు చిన్నప్పటి నుండే నాయకత్వ లక్షణాలను అలవర్చు కోవాలని ఎంఎన్ఓ బుధారపు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల మార్గదర్శనంలో బాలసభను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన సజనాత్మకను వెలికి తీయడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషిచేయాలన్నారు. ప్రతి విద్యార్థి నేటి పోటీ ప్రపంచంలో ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకొని, అన్ని అంశాలపై సంపూర్ణ పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆంగ్ల మాధ్యమంలో విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు ప్రత్యేక ఆకర్షనీయంగా నిలిచాయి. అనంతరం ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థి తిమ్మిడి సాయికుమార్ ను ఉపాధ్యాయుల బందం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజలింగం, సదయ్య, అంజయ్య, టకీం పాషా, గౌరీ శంకర్, శ్రీధర్, షౌకత్ అలీ, సువర్ణ, కరుణ, హైమ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-గార్ల

మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కొప్పుల వెంకటయ్య (64) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందగా ఫ్రెండ్స్ యూత్, రైతుల ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి 17400 రూపాయలను వితరణగా అందించారు. వెంకటయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పిం చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,ఫ్రెండ్స్ యూత్ కమిటీ సభ్యులు ఉన్నారు.

మాజీ ముఖ్యమంత్రిని కలిసిన బీరవెల్లి

నవతెలంగాణ-గూడూరు



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును బీరవెల్లి బ్రదర్స్ టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా నాయకులు బీరవెల్లి వేణుగోపాల్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో శనివారం కలిశారు ఈ సందర్భంగా మహబూబాద్ జిల్లాకు సంబంధించిన రాజకీయ పరిణామాలపై బీరవెల్లి బ్రదర్స్ ద్వారా మాజీ ముఖ్యమంత్రి తెలుసుకున్నారు.

నియోజకవర్గంలో పారదర్శక పాలన అందిస్తాం

- పేదింటి ఆడబిడ్డకు అండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి

నవతెలంగాణ-తొర్రూరు / పెద్దవంగర



రాష్ట్రంలో పేద ఇంటి ఆడ పిల్లలకు అండగా, తెలంగాణ రాష్ట్రానికి పెద్ద కొడుకుగా మన సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని, పాలకుర్తి నియోజకవర్గంలో పారదర్శక పాలన అందిస్తామని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శనివారం తొర్రురు పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దవంగర మండలానికి సంబంధించిన 31మంది లబ్ధిదారులకు రూ. 31,31,496లు విలువగల షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రానున్న కాలంలో పేదల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలు చేస్తామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యపు పాలన వల్ల రాష్ట్ర ఖజానాకు భారీగా దెబ్బలినటంతో తులం బంగారం అందించలేక పోతున్నామని, వారి దోపిడీని ఎండగట్టి పారదర్శక పాలన అందిస్తామన్నారు. రాష్ట్రంపై బీఆర్ఎస్ మోయలేని భారాన్నివేసి ప్రజల భవిష్యత్ ను ప్రశ్నార్థకం చేసిందన్నారు. త్వరలోనే కళ్యాణ లక్ష్మి చెక్కులతో పాటుగా తులం బంగారం సైతం అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలతో నిరుపేదలు లబ్ధి పొందుతున్నారని, మా ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, వైస్ ఎంపీపీ బొమ్మెరబోయిన కల్పన రాజు యాదవ్, తోటకూరి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీసు హరికృష్ణ గౌడ్, ఎంపీటీసీ సభ్యులు బానోత్ రవీందర్ నాయక్, బానోత్ విజయ, ఈరెంటి అనురాధ, సీనియర్ నాయకులు సలిదండి సుధాకర్, మెట్టు నగేష్, పాకనాటి రామకృష్ణ రెడ్డి, జాటోత్ వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి ఓరిగంటి సతీష్, ఆరై భూక్య లష్కర్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంచే 'నవతెలంగాణ' పుస్తకాలను ఆదరించండి : తమ్మెర



నవతెలంగాణ-తొర్రూరు

తొర్రూరు మండల కేంద్రంలో నవ తెలంగాణ పబ్లిషర్స్ వాళ్లచే నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శనను శనివారం సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు సందర్శించారు . ఈ పుస్తక ప్రదర్శనలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచేపుస్తకాలు ఈ ప్రదర్శనలు ఉన్నాయని ,అలాగే విద్యార్థులకు, యువకులకు ఈ సమాజం గురించి సమ సమాజ స్థాపన కోసం కావలసిన విజ్ఞానాన్ని పెంచే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, మూఢనమ్మకాలను తొలగించి ,శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రజలకు అందించడమే ఈ పుస్తక ప్రదర్శన ప్రధానమైన ఉద్దేశం అని అన్నారు. కాబట్టి పాఠకులు , విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగస్తులు అందరూ కూడా ఈ పుస్తక ప్రదర్శన ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, అమీర్ స్థానికులు పాల్గొన్నారు.

గిరిజన బాలిక వసంతకు న్యాయం చేయాలి

- మరిపెడలో కొవ్వొత్తులతో ర్యాలీ

నవతెలంగాణ-మరిపెడ



మండలంలోని లక్ష్మా తండాకు చెందిన బానోతు వసంత మైనర్ బాలికను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు బీమా నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాత్రి వసంత మృతికి నిరసనగా మరిపెడ పట్టణ కేంద్రంలోని గిరిజన యువకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. గిరిజన బాలికపై జరిగిన సంఘటనపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దోషులను గుర్తించి శిక్షించేంతవరకు దశలవారీగా గిరిజన ఉద్యమాలు ఉంటాయని భీమా నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ మాజీ నాయకులు భూక్య రామ్మూర్తినాయక్, విజయ్‌నాయక్, ప్రవీణ్ నాయక్, శ్రీనివాస్ నాయక్, తదితరులు ఉన్నారు.

అంగన్వాడీలకు మేడారం డ్యూటి చేసిన డబ్బులు చెల్లించాలి

• సీఐటీయూ డిమాండ్

నవతెలంగాణ-ములుగు



మేడారం మహా జాతర లో విధులు నిర్వహించిన అంగన్వాడీ టీచర్ల కు డబ్బులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం అదనపు కలెక్టర్ మహేందర్ జీ కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మేడారం మహా జాతర ముగిసి ఇప్పటికి మూడు నెలలు దాటుతోంది అయినా డ్యూటీ చేసిన అంగన్వాడీ లకు డబ్బులు చెల్లించక పోవడం ప్రభుత్వం నిర్లక్ష్యం కు నిదర్శనం అన్నారు. జాతర విధి నిర్వహణ లో కుటుంబాలను సైతం వదిలేసి రోజుల తరబడి రేయింబవళ్ళు విధులు నిర్వహిస్తే ఇంతవరకు డబ్బులు ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికయినా అధికార యంత్రాంగం స్పందించి డబ్బులు చెల్లించాలనీ అన్నారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి కె సమ్మక్క, జిల్లా కమిటీ సభ్యులు సరిత పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థులను,ఉపాధ్యాయులను అభినందించిన ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ భవేష్ మిశ్రా

నవతెలంగాణ-చిట్యాల



మండల ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి జిల్లా టాపర్గా నిలిచిన విద్యారులను అందుకు ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా అభినందించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల విద్యార్థులు అధిక మార్కులు సాధించి ద్వితీయ సంవత్సరంలో జిల్లా టాపర్గా నిలిచిన యు.రమేష్ 1000/978, ప్రథమ సంవత్సరం విద్యార్థిని జి.మాధురి 470/463 మార్కులు సాధించు జిల్లా టాపర్గా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ శరదతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి బోధించిన ఉపాధ్యాయులు ప్రశంసించారు. ప్రభుత్వ కళాశాలల్లో తల్లిదండ్రులను చేర్పించి తమ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



భూ సేకరణ చట్టం ప్రకారం

రైతులకు నష్ట పరిహారం అందిస్తాం

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నవతెలంగాణ-భూపాలపల్లి

గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణ పై రైతులు ఎలాంటి అపోహలు చెందొద్దని అని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.శనివారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణ పై టేకుమట్ల, చిట్యాల, మొగుళ్ళపల్లి మండలాలకు చెందిన రైతులతో సమా వేశం నిర్వహించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అభివృద్ధికి రహదారులు ఏర్పాటు అత్యంత అవసరమని గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ద్వారా జిల్లా అభివద్ధి చెందుతుందని తెలిపారు. ప్రాజెక్ట్ ల నిర్మాణం కోసం భూ సేకరణ చేయడం జరుగుతుందని అన్నారు. భూ సేకరణ చట్టం ప్రకారం రైతుల అభీష్టం ప్రకారమే భూసేకరణ చేస్తామని అన్నారు. 350 ఎకరాలు 35 కిలో మీటర్ల దూరంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే వస్తుందని రోడ్డు నిర్మాణం కోసం 45 మీటర్ల వెడల్పు సేకరణ చేయాల్సి ఉన్నదని అన్నారు. రైతుల అంగీకారంతో భూ సేకరణ విషయం లో భూముల ధరలు, భూముల పట్టాలలో తప్పులు, కొంతమందికి పట్టాలు లేకపోవడం లాంటి విషయంలో ప్రభుత్వం తరుపున సహకారం అందిస్తామని తెలిపారు. రైతులు తెలిపిన డిమాండ్లను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తామని భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు నష్ట పరిహారం అందిస్తామని అభివద్ధితో పాటు రైతులకు న్యాయం జరిగేలా చేస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ మంగీలాల్, నేషనల్ హైవే అధికారులు, మూడు మండలాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీల జోరు...

వార్తకు కదిలిన జిల్లా యంత్రాంగం

నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ చిట్యాల

శనివారం నవ తెలంగాణలో ప్రచురితమైన నకిలీల జోరు.. అనే వార్త కథనానికి స్పందన జిల్లా యంత్రాంగం కదిలింది శనివారం ఉదయం మండల కేంద్రంలోని ప్రత్తి విత్తనాలు అమ్మే షాపుల్లో జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ప్రతి షాపును క్షుణ్ణంగా పరిశీలిస్తూ బిల్లులు రికార్డ్స్ ప్రత్తి గింజల ప్యాకెట్స్ మిరపగింజలను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు ఉంటాయని షాపు యజమానులకు హెచ్చరించారు. ఈ విషయంపై భూపాలపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆ ప్రాంత రైతులతో మాట్లాడినట్లు తెలిసింది నకిలీ విత్తనాలు అమ్మి రైతులను ఎవరైనా ఏ పార్టీకి చెందిన వారైనా మోసం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ అధికారులు మండల వ్యాప్తంగా తనిఖీలు చేపట్టడం జరిగింది

ఈ విషయమై సంబంధిత మండల ఫర్టిలైజర్ షాప్ యజమానులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులను మోసం చేస్తూ అక్రమ విత్తనాలను విక్రయిస్తూ లక్షల రూపాయలు సంపాదిస్తూ ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ లో చేరుతూ అధికార పార్టీ అండదండలతో అందలమెక్కుతున్నారని ఫెటిలైజర్ యజమానులు ఆరోపిస్తున్నారు. లక్షల రూపాయల పత్తి మిరప గింజలు నకిలీల బాగోతం బయటపడే అవకాశం ఉన్నట్లు వారు పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే అనేక విషయాలు బయటపడే అవకాశం ఉన్నట్లు ప్రజలు రైతులు తెలిపారు.


సింగరేణిలో ఈపీ ఆపరేటర్ల ఎంపిక పరీక్ష

నవతెలంగాణ - కోల్‌బెల్ట్

సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈపీ ఆపరేటర్ల ఎంపిక పరీక్ష ఈనెల 18 నుండి 21 వరకు సింగరేణి వ్యాప్తంగా ఆరు ఏరియాలలో నిర్వహించబడునని యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత కలిగిన 1705 మందికి కాల్ లెటర్లు పంపించడం జరిగిందని పేర్కొన్నారు. ఈనెల 18 నుండి 21 వరకు డ్రైవింగ్ ప్రొఫెషయన్సి టెస్ట్ కొత్తగూడెం రీజియన్- ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్, గౌతమ్ పూర్, ఆర్జీ-వన్ -జవహర్లాల్ నెహ్రూ స్టేడియం గ్రౌండ్స్, ఆర్జీ 2, ఆర్జీ 3, ఏపీఏ - రాణి రుద్రమ దేవి స్టేడియం గ్రౌండ్స్ సెంటినరీ కాలనీ, భూపాలపల్లి ఏరియా- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్స్, శ్రీరాంపూర్ ఏరియా- ప్రగతి స్టేడియం గ్రౌండ్స్, మందమర్రి ఏరియా- ఎస్ సి హెచ్ స్కూల్ గ్రౌండ్స్ లో నిర్వహించబడును. డ్రైవింగ్ ప్రొఫెషియన్సీ టెస్ట్ 60 మార్కులకు ఉంటుందని, కనీసం 50% మార్కులతో ఉత్తీర్ణులైన వారికి ఈనెల 30న కొత్తగూడెం సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మల్టిపుల్ ఛాయిస్ లో రాత పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం అభ్యర్థుల ఫైనల్ మార్కుల జాబితా హెడ్ ఆఫీస్ లోని నోటీస్ బోర్డులో పెట్టడం జరుగుతుందన్నారు. అభ్యర్థుల ఎంపిక పరీక్ష విధానం పూర్తిగా పారదర్శకంగా ఉంటుందని, దళారులను నమ్మి మోసపోవద్దని, ఎటువంటి అపోహలకు తావివ్వొద్దని ప్రకటనలో పేర్కొన్నారు .

ప్రగతి చక్రం పురస్కారం అందుకున్న పార్వతమ్మ

నవతెలంగాణ-మహదేవపూర్



కండక్టర్ పార్వతమ్మకు ప్రగతి చక్రం పురస్కారం ఆర్టీసీ లో ఉత్తమ సేవలు అందించినందున ప్రగతి చక్రం పురస్కారం కైవసం చేసుకున్న మహాదేవపూర్ మండలం సూరారం మన గ్రామం ముద్దు బిడ్డగా కో కు పార్వతమ్మ కండక్టర్కు పలువురు అభినందనలు తెలిపారు మారు మూల ప్రాంతంలో నుండి ధైర్యంగా కండక్టర్ ఉద్యోగంలో చేరి ఉత్తమ పురస్కారం అందుకున్న కండక్టర్ పార్వతి మాట్లాడుతూ ప్రశంసాపత్రం దక్కినందుకు నాకు చాలా ఆనందము.మన గ్రామమునకు గర్వకారణం.భవిష్యత్తులో మరేన్నో కైవసం చేసుకోనే మరిన్ని పురస్కారాలు అందుకుంటున్నానే ఆశ భవం వ్యక్తం చేశారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

నవతెలంగాణ-గణపురం

చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కెటిపిపి ఆర్టిజన్ కార్మికుడి గా పనిచేస్తున్న చిలువేరు మల్లయ్య కు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకున్నందుకు శనివారం తోటి కార్మికులు సన్మానించారు కెటిపిపి లో ఆర్టిజన్ కార్మికుడిగా పనిచేస్తున్న చిలువేరు మల్లయ్య సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డులు ప్రధానం చేసింది.ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ ఉద్యోగులు జె. చందన్ సింగ్, మోతె తిరుపతి, రవిందర్ నాయక్, కందికొప్పుల అనిల్ కుమార్,మేకల శ్రీనివాస్, మోరె కుమార్, బొమ్మకంటి రాజేందర్, ఇనుగాల కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో అధిక ధరలు

• మార్క్సిజమే సకల సమస్యల పరిష్కారానికి మార్గం
• సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు జే వెంకటేష్
• సమరశీలి పోరాటాలకు సిద్ధం కావాలి..
• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు





నవతెలంగాణ-భూపాలపల్లి

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతోనే అధిక ధరలు పెరుగుతున్నాయని,మార్క్సిజమే సకల సమస్యల పరిష్కారానికి మార్గం అని సీపీఐ (ఎం) రాష్ట్ర నాయకులు జే వెంకటేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రామిక భవనంలో సీపీఐ (ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండవ రోజు నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతులకు సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు అధ్యక్షత వహించగా, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం దేవేందర్ ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ... సమాజాన్ని అనేకమంది తత్వవేత్తలు అనేక విధాలుగా పరిశీలించి పరిశోధించారన్నారు. కారల్ మార్క్స్ ప్రణాళిక కార్యక్రమం పెట్టుబడే దారి విధానం గ్రంథాన్ని రూపొందించారన్నారు.కనీస కూలి రేట్లు కరువయ్యాయని, దళితులు గిరిజనుల మీద దాడులు పెరిగాయని, ఉపాధి పనులు అడుగంటాయన్నారు. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిందని, ప్రభుత్వ భారాలు పెరిగాయన్నారు. దానికి తగ్గట్టుగా పని పెరగలేదు డబ్బులు పెరగలేదన్నారు. భారత పెట్టుబడుదారులు విదేశీ సామ్రాజ్యవాదులతో మిలాకత్ అవుతున్నారన్నారు. ప్రభుత్వాలు కేవలం సంక్షేమ పథకాల వరకే పరిమితమయ్యారని, అందరికీ భూమి, ఇళ్ల స్థలాలు, విద్య వైద్య సౌకర్యాలు కనుమరుగవుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు నెరవేరలేదని,సమాజం మార్పు చెందాలన్నారు. కార్మిక వర్గమే రాజ్యాధికారంలోకి రావాలని, కూలీలు రైతులు వత్తిదారులు దళితులు గిరిజనులు అందరినీ కలుపుకొని రాబోయే కాలంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

అనంతరం సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా సిపిఐ ఎం పార్టీ సభ్యులు, ప్రజా సంఘాలు, అనుబంధ సంఘాలు ప్రజల స్థానిక సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ అన్నారం, భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి యుద్ధం చేసేందుకు సిద్ధం కావాలన్నారు. జిల్లా కేంద్రానికి రైల్వే మార్గం, సింగరేణి, జెన్కో సమస్యల పరిష్కారం, జిల్లా కేంద్రంలో బీఈడీ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు కోసం, సింగరేణి, జెన్కో ఆధారిత పరిశ్రమలు, సిమెంటు కర్మాగారం, కోల్ శుద్ధి కర్మాగారం, ఎరువుల కర్మాగారంఏర్పాటు ప్రభుత్వాలు చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటి పట్టాల కోసం, పోడు భూముల పట్టాల కోసం, సాగునీరు తాగునీరు కోసం, కార్మికుల కనీస వేతనాల కోసం, రైతుల గిట్టుబాటు ధరల కోసం, ఉపాధి హామీ పనుల కోసం, తునికి ఆకు బోనస్ కోసం, దళిత గిరిజన మహిళా సమస్యల పరిష్కారానికి, విద్యార్థి యువజన సకల సమస్యల పరిష్కారానికి, వత్తిదారుల సమస్యల పరిష్కారానికి పెండింగ్ లో ఉన్న సమస్యల సాధన కోసం ప్రభుత్వాల మీద ఒత్తిడి బెంచి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు వి రాజయ్య, శ్రీకాంత్, ప్రీతి, ఆకు దారి రమేష్, గడప శేఖర్, మేకల మహేందర్, సిహెచ్ రవికుమార్, ఎం రాజేందర్, వంగాల విజయలక్ష్మి కొండపాక రజిని, నూనెటి నరేష్, భారతక్క, బిక్షపతి, గోపాల్, పాదార మల్లయ్య, ఈశ్వర, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల కుట్ర భగ్నం చేసిన పోలీసులు

• బాంబులు అమరుస్తున్న మావోయిస్టుల అరెస్టు
• వివరాలు వెల్లడించిన ములుగు జిల్లా ఎస్పీ శబరిష్



నవతెలంగాణ-వెంకటాపురం

ఛత్తీస్గఢ్- తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వెంకటాపురం మండలం తడపల కర్రగుట్టల వద్ద దట్టమైన అడవుల్లో పోలీసుల కూంబింగులే లక్ష్యంగా మావోయిస్టులు మందు పాతరాలు అమరుస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ఈనెల 13న కుంబింగ్ చేస్తున్న పోలీసులను చూసి పోతున్న ఆరుగురు వ్యక్తులలో ఇద్దరు మహిళలు ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో వెంకటాపురం- వాజేడు మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ డిప్యూటీ కమాండర్, ఇద్దరు దళ సభ్యులు, ముగ్గురు మలేషియా సభ్యులు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వారిని అరెస్ట్ చేసి. శనివారం జిల్లా ఎస్పీ శబరిష్ వారి వివరాలను వెల్లడించారు. రాష్ట్ర సరిహద్దుల్లోని దట్టమైన కర్రగుట్ట అడవుల్లో మావోయిస్టులు మిలిషియా సభ్యులతో కలిసి కుంబింగ్ పోలీసుల లక్ష్యంగా మందు పాత్రలు అమరుస్తున్న సమాచారం మేరకు పోలీసులు అడవుల్లో కుంబింగ్ చేపట్టారు. కుంబింగ్ చేస్తున్న పోలీసులను చూసి పారిపోతున్న ఇద్దరు మహిళలు, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఒక డిబిబిఎల్ తుపాకీ, నాలుగు కిట్ బ్యాగులు, రెండు వాకి టాకీలు, పేలుడు సామాగ్రిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. ఈ విచారణలో వెంకటాపురం- వాజేడు ఏరియా కమిటీ డిప్యూటీ కమాండర్ బుద్రి అలియాస్ రీత, పామేడు ఏరియా కమిటీ సభ్యురాలు కోసి అలియాస్ మోతే, బెటాలియన్ సభ్యులు విజయ్ అలియాస్ ఇడుమా మిలీషియా సభ్యులు దస్రు, సోడి ఉర్ర, భీమాలను గుర్తించినట్లు తెలిపారు.

స్వాధీనం చేసుకున్న సామాగ్రి...

వారి నుంచి ఒక డిబి బిఎల్ తుపాకీ, 10 డిబిబిఎల్ మందుగుండు సామాగ్రి, 17 మీటర్ల వైరు, ఆరు డిటోనేటర్లు, 20 బ్యాటరీలు, ప్రెషర్ కుక్కర్, టిఫిన్ బాక్స్, 18 మీటర్ల వైరు, మ్యాన్ వాల్, స్విచ్లు, కత్తులు, ఆమ్ మీటర్, ఇనుప వస్తువులు, ఆరు చార్జర్లు, కారు తాళాలు,, టార్చ్ లైట్, , రేడియో తో పాటు 20 గుళికలు, పార్టీ సాహిత్యం, బ్యాగు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పి వివరించారు..

వీరిపై పలు కేసులు.........

అరెస్ట్ చేసిన మావోయిస్టులపై చట్టవ్యతిరేకమైన పలు కార్యక్రమాలకు విధ్వంసకర సంఘటనలో ప్రత్యేకంగా పాల్గొన్నట్లు ఎస్పి వివరించారు. బుద్రి అలియాస్ రిత పై 30 కేసులు ఉన్నాయన్నారు. వెంకటాపురం మండలం బోదపురం కు చెందిన భీమేశ్వరరావు , రమేష్, ఇల్లందుల ఏసు హత్యలు మీరు పాల్గొన్నట్లు తెలిపారు. అంతేకాకుండా వెంకటాపురం మండలం రామాంజపురం గ్రామ శివారులో పోక్లెయిన్ తగలబెట్టడం, వీరభద్రపురం వద్ద ప్రభుత్వ నిషేధిత కరపత్రాలు విడుదల చేయడం, పార్టీ ఫండ్ వసూలు, ఎల్ఈడి బాంబులు అమర్చిన 24 కేసుల్లో ఈమె నిందితురాలుగా ఉన్నట్లు ఎస్పి వివరించారు. సోడి, కోసి,, విజయ్,దస్రు, ఉర్ర, భీమాలపై పలు రకాల కేసులు ఉన్నట్లు వివరించారు.

మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి : జిల్లా ఎస్పీ శబరిష్

ప్రభుత్వ నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ లో పనిచేస్తున్న మావోయిస్టు జనజీవన స్రవంతిలో కలవాలని మునుగు జిల్లా ఎస్పీ శబరిష్ తెలుగునిచ్చారు. పోలీసులు ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ పరంగా పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మావోయిస్టులకు సహకరించవద్దని సహకరించిన, సంఘవిద్రోహ చర్యలకు పాల్పడ్డ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ములుగు డీఎస్పీ రవీందర్, వెంకటాపురం సిఐ బండారి కుమార్, ఎస్సైలు ఆర్ అశోక్, కె తిరుపతి రావులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రాష్ట్ర మంత్రి తుమ్మలకు వినతి



నవతెలంగాణ-భూపాలపల్లి

నియోజకవర్గంలో ఉన్నటువంటి చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కోరారు. శనివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో రాష్ట్ర వ్యవసాయ, చేనేత, సహకార, మార్కెటింగ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....భూపాలపల్లి నియోజకవర్గంలోని చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. శాయంపేట చేనేత సహకార సంఘం దగ్గర నిల్వ ఉన్న వస్త్రాలు తక్షణమే కొనుగోలు చేసి, పెండింగ్ లో ఉన్న కార్మికుల బిల్లులను విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు. సమస్యలను విన్న మంత్రి తుమ్మల సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రితో చర్చించి సమస్యలను పరిష్కరించేలా చూస్తానని మంత్రి తుమ్మల హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ ముఖ్య నేతలు ఎస్ఎస్సార్ సంపత్ రావు, గండ్ర సత్యనారాయణ రెడ్డి, కిషన్ రావు ఉన్నారు.

ఎల్ఓసి అందజేత

నవతెలంగాణ-మల్హర్‌రావు

మంథని నియోజకవర్గం మహముత్తరం మండలంలోని మహబూబ్ పల్లి గ్రామానికి చెందిన జాడి శ్రీశైలం అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్ళడంతో స్పందించిన మంత్రి వైద్య ఖర్చుల కోసం సిఎంఎఫ్ఆర్ ద్వారా రూ.1.60 లక్షల ఎల్ఓసిని మంజూరు చేయించారు. ఆసుపత్రి సహాయకుడి ద్వారా హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం అందజేశారు.బాధితుని కుటుంబం మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

సోలార్ పవర్ సిస్టమ్‌ను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-భూపాలపల్లి

సమీకృత కలెక్టర్ కార్యాలయ భవనంపై నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ పవర్ సిస్టమ్ ను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా శనివారం పరిశీలించారు..ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని అన్ని శాఖల విద్యుత్ బిల్లు జీరో చేసేందుకు విద్యుత్ వినియోగానికి ప్రత్యామ్నయంగా సోలార్ ప్లాంటు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వినియోగాన్ని బట్టి అదనంగా మరో రెండు వందల కిలో వాట్ల సోలార్ పవర్ పానెల్ ను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, రెడ్కో అధికారి మహేందర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్.ఈ.మల్చూర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.


నిరుపయోగ వాహన విడి పరికరాలకు వేలం

నవతెలంగాణ-భూపాలపల్లి

ఈ నెల 19 బుధవారం జిల్లా పోలీస్ శాఖకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న వాహన విడి పరికరాలకు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి జిల్లా ఆర్మ్డ్ రిజర్వు ప్రధాన కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఈ వేలంలో ప్రజలు ఎవరైనా పాల్గొనవచ్చుని, ఈ వేలం ప్రక్రియ ఈనెల 19న ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని వేలం లో పాల్గొనేవారు, తమ ఆధార్ కార్డు లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డుతో పాటు, రూ. 3000 రుసుము చెల్లించాలని, కొనుగోలు చేయని వారి రుసుము తిరిగి చెల్లించడం జరుగుతుందని తెలిపారు. వేలం గురించి మరిన్ని వివరాలకు ఆర్మ్డ్ రిజర్వు ప్రధాన కార్యాలయంలోని ఎం టి ఓ కిరణ్ ను 8712658170 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించవచ్చుని సూచించారు.

మాసు రాజయ్య జయంతి వేడుకలు

నవతెలంగాణ-చిట్యాల



చిట్యాల గ్రామాన్ని అభివద్ధి పథంలో నడిపించి జిల్లలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు తీసుకోని మృతి చెందిన చిట్యాల గ్రామ దివంగత సర్పంచ్, మాజీ విలేకరి మాసు రాజయ్య జయంతి చిట్యాల మండల కేంద్రం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాసు రాజయ్య చారిటబుల్ ట్రస్ట్ నిర్వహుకులు మాసు రమేష్ మాట్లాడుతూ రాజయ్య సేవలు ప్రజల మదిలో ఎల్లపుడు ఉంటాయన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో పుల్ల సతీష్ కుమార్,గురుకుంట్ల కిరణ్, రాజేందర్, కోడెల. మహేష్, గుండా దినేష్, టేకు సతీష్, మాటూరి లవన్, కట్కూరి సునీల్, గుర్రపు రాజేందర్,అక్బర్ ఆసుపత్రి సిబ్బంది రాజేందర్, జెట్టి రాజన్న, బుచ్చన్న, అల్లకొండ సారయ్య, కుమార్, శశి కుమార్ పాల్గొన్నారు.

లాభాల వాటా 35% ఇప్పిచ్చేందుకు కషి చేస్తాం

• లాభాల వాటా 35% ఇప్పిచ్చేందుకు కషి చేస్తాం
• మారు పేర్లు ఒకేసారి క్రమబద్ధీకరించేందుకు ఒత్తిడి తెస్తాం
• ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్



నవతెలంగాణ -కోల్ బెల్ట్ :

2023-24 ఆర్థిక సంవత్సరం సింగరేణి లాభాలలో కార్మికులకు 35% వాటా ఇప్పించేలా కషి చేస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కేటికే-6 గని ఆవరణలో ఫిట్ సెక్రటరీ జి .శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్ లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సింగరేణిలో మారుపేర్లతో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికుల మారు పేర్లను ఒకే దఫాలో క్రమబద్ధీకరించేలా యాజమాన్యం పై ఒత్తిడి తెస్తామని తెలిపారు. సింగరేణి యాజమాన్యం నష్టాల పేరుతో భూగర్భగనులను మూసివేసే కుట్ర పన్నుతున్నదని దానిని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చరించారు. కొత్త గనుల వేలంలో సింగరేణి సంస్థ పాల్గొని మనమే బొగ్గు బ్లాక్ లను కొనుగోలు చేసి బొగ్గును ఉత్పత్తి చేసే విధంగా చొరవ తీసుకోవాలని ఏఐటీయూసీ యూనియన్ ద్వారా చైర్మన్ కు వివరించడం జరిగిందని తెలిపారు. అండర్ గ్రౌండ్ లో ఉన్న ఎస్ డి ఎల్ యంత్రాల కాలపరిమితి ముగిసినా పాత వాటితోనే పనిచేయడం, వాటికి సరైన మెటీరియల్ తీసుకురావడంలో యాజమాన్యం వైఫల్యం చెందడమే కాకుండా అండర్ గ్రౌండ్ గనులలో నష్టాలను చూపించి అండర్ గ్రౌండ్ గనులను మూసే కుట్ర యాజమాన్యం చేస్తుందని ఈ కుట్రను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, మాతంగి రామ్ చందర్, బ్రాంచ్ కమిటీ సభ్యులు చంద్రమౌళి,సత్యనారాయణ,మనోజ్ కుమార్,వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ రాజన్న,హకీమ్, లక్ష్మణ మూర్తి,పిట్ సెక్రటరీ శ్రీను, అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు గోవర్ధన్, మైన్స్ కమిటీ సభ్యులు,సేఫ్టీ కమిటీ సభ్యులు, షిఫ్ట్ ఇన్చార్జులు, అసిస్టెంట్ షిఫ్ట్ ఇన్చార్జులు, ఏఐటియూసి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అత్యాచారం, హత్య చేసిన నిందితుని బహిరంగంగా శిక్షించాలి

బాలిక కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్ గ్రేషియో చెల్లించాలి.

ఉత్తర తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు పీక కిరణ్

నవతెలంగాణ-మల్హర్ రావు.

పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ లో బాలికపై అత్యాచారం చేసి,హత్యకు పాల్పడిన నిందితున్ని బహిరంగంగా శిక్షించాలని ఉత్తర తెలంగాణ మాలమహానాడు అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్ చేశారు.మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు జిల్లా వ్యాప్తంగా రైస్ మిల్లులలో తక్కువ వేతనాలకు ఇతర రాష్ట్రాల్లో ఉండే కార్మికులను తీసుకొచ్చి ఏలాంటి నిబంధనలు పాటించకుండా పరిచయం చేసుకుంటున్నా యాజమాన్యాలు అక్కడ ఏం జరిగినా పట్టించుకోని అధికారులు ప్రతి సంవత్సరం ఏదో ఒక ఘటన జరుగుతున్న కఠినమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు.

గత సంవత్సరం ఇటిక బట్టీలలో బాలిక పైన ఇదే రకమైన దుశ్చర్య జరిగిందని, అయినా అధికారులు పోలీసు యంత్రాంగం కఠినమైన చర్యలు తీసుకోకపోవడంతో నేరస్థులకు భయం లేకుండా పోతుందన్నారు.ఇతర రాష్ట్రాల నుండి కార్మికులను తీసుకువచ్చినప్పుడు వారికి సంబంధించిన వివరాలు సంబంధించిన అధికారుల వద్ద పోలీస్ సిబ్బంది వద్ద లేకపోవడం కూడా ఇలాంటి ఘటనలు ఎన్నో జరుగుతున్నాయన్నారు. యాజమాన్యాల పైన నిందితులపైన వెంటనే కేసు పెట్టి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ మండలంలో కాట్నపల్లి బాలికను అత్యాచారం చేసి , హత్య చేసిన నిందితుణ్ణి ఫోక్సో చట్టం ప్రకారం శిక్షించి వారి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్ గ్రేషియో చెల్లించి ఆదుకోవాలని రైస్ మిల్లు యాజమాన్యాల పైన కూడా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు .

బిజినెస్

ఆర్థిక మోసాలకు సగం మంది బలి

- మూడేండ్లలో 47 శాతం మంది
- యూపీఐ, క్రెడిట్ కార్డు మోసాలే ఎక్కువ



ముంబయి : గడిచిన మూడేండ్లలో దేశంలో 47 శాతం మంది ఆర్థిక మోసాల బారిన పడ్డారని ఓ రిపోర్ట్‌లో వెల్లడయ్యింది. తాము లేదా తమ కుటుంబ సభ్యులు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఆర్థిక మోసాలకు గురైయ్యారని లోకల్‌సర్కిల్స్ సర్వేలో తేలింది. యూపీఐ, క్రెడిట్ కార్డ్ మోసాలే అధికంగా జరిగాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా 302 జిల్లాల నుంచి 23,000 మందిని ఈ సర్వేలో భాగస్వామ్యం చేసింది. ఇందులో 62 శాతం మంది పురుషులు కాగా, 38 శాతం మంది మహిళలు ఉన్నారు. సగం మందికిపైగా తమ క్రెడిట్ కార్డులపై దేశ, విదేశీ వ్యాపారులు, వెబ్‌సైట్ సంస్థలు అనధికారిక చార్జీలను వేశారని తెలిపారు. ఇక సర్వేలో పాల్గొన్న వారిలో 43 శాతం మంది తాము లేదా తమ కుటుంబ సభ్యులు క్రెడిట్ కార్డ్ లావాదేవీల్లో మోసపోయామని, 36 శాతం మంది యూపీఐ లావాదేవీల్లో నష్టపోయామన్నారు. పట్టణాల్లో మోసపోయిన ప్రతీ 10 మందిలో నలుగురు చెల్లింపును అంగీకరించడానికి పంపిన లింక్ లేదా క్యూఆర్ కోడ్ వల్ల వారి ఖాతా నుంచి తెలియకుండానే డబ్బు బదిలీ అయ్యిందని తెలిపారు. గత మూడేళ్లలో పట్టణ ప్రాంతాల్లో ప్రతీ ఇద్దరిలో ఒక్కరు అనధికార చార్జీలకు గురైయ్యారు. ఇలాంటి మోసాలను ఎదుర్కొన్నట్లు 53 శాతం మంది పేర్కొన్నారు. లోకల్ సర్కిల్స్ రిపోర్ట్ ప్రకారం.. ఆర్‌బీఐ, యూపీఐ, క్రెడిట్ కార్డులు జారీ చేసే బ్యాంకులు ఇలాంటి ఆర్థిక మోసాలను నిరోధించేందుకు మరిన్ని రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అధ్యయనంలో తేలింది. దేశంలోని వేలాది మంది డేటా విక్రేతల ద్వారా వినియోగదారుల క్రెడిట్ కార్డ్ డేటా సులభంగా అమ్మకానికి అందుబాటులోకి వచ్చిందని లోకల్ సర్కిల్స్ తెలిపింది. పాన్ కార్డ్, ఆధార్, మొబైల్ నంబర్, ఈ మెయిల్, చిరునామా వంటి వ్యక్తిగత సమాచారం అమ్మకానికి డేటాబేస్‌లలో సులభంగా అందుబాటులోకి వచ్చిం ది. దీంతో ఆర్థిక మోసగాళ్లు సులభంగా ప్రజలను బురిడి కొట్టిస్తున్నారని వెల్లడించింది. ఆర్థిక సంవత్సరం 2023-24లో బ్యాంకింగ్ మోసాలు రికార్డ్ స్థాయిలో 300 శాతం పెరిగి 36,075కు చేరాయని ఇటీవల ఆర్‌బీఐ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. గత రెండేండ్లలో మొత్తం సైబర్ మోసాలు 700 శాతం పెరిగాయని వెల్లడించింది. 2021-22లో 3,596 కార్డ్, ఆన్‌లైన్ మోసాలు జరిగితే, 2023-24లో ఆ సంఖ్య 29,082కు పెరిగింది.

రుణాలపై వడ్డీ రేట్ల పెంపు ఎస్‌బీఐ నిర్ణయం

SBI

ముంబయి : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రుణాలపై వడ్డీ రేట్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో రుణ గ్రహీతల వాయిదాల చెల్లింపు (ఈఎంఐ)లపై భారం పెరగనుంది. ఎస్‌బీఐ తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్లు లేదా 0.1 శాతం పెంచింది. సవరించిన కొత్త వడ్డీ రేట్లు జూన్ 15 నుంచి అమల్లోకి వస్తాయని ఎస్‌బీఐ తన వెబ్‌సైట్‌లో వెల్లడించింది. ఆరు నెలల ఎంసీఎల్ఆర్ 8.55 శాతం నుంచి 8.65 శాతానికి పెరిగింది. ఏడాది కాలపరిమితిపై ఎంసీఎల్ఆర్ 8.65 శాతం నుంచి 8.75 శాతానికి చేర్చింది. రెండేండ్ల ఎంసీఎల్ఆర్ 8.75 శాతం నుంచి 8.85 శాతానికి, మూడేళ్ల ఎంసిఎల్ఆర్ 8.85 శాతం నుంచి 8.95 శాతానికి మార్చింది. ఎస్‌బీఐ తాజా పెంపునతో గృహ, వాహన, రిటైల్ రుణ గ్రహీతలపై భారం పడనుంది.

ఇక పూర్తి స్థాయి అభివృద్ధిపై దృష్టి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- టైమ్స్ హోం హంట్ ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రారంభం



హైదరాబాద్ : ఎన్నికల కోడ్ వల్ల ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని.. ఇకపై పూర్తి స్థాయిలో అభివృద్ధిపై దృష్టి పెడుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన టైమ్స్ హోం హంట్ ప్రాపర్టీ ఎక్స్‌పో కార్యక్రమాన్ని మంత్రి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగానికి అనువైన ప్రాంత మన్నారు. అమరావతితో పోల్చినప్పటికీ హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అమరావతిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని ఆశిస్తున్నామన్నారు. హైదరాబాద్ అభివృద్ధి విషయంలో ఆర్‌ఆంఆర్, రిజినల్ రింగ్ రోడ్, మెట్రో డెవలప్మెంట్, మూసీ డెవలప్ మెంట్‌పై సీఎం దృష్టి సారించారన్నారు. పక్క రాష్ట్రంలో వేరే ప్రభు త్వం వచ్చిందని, మన దగ్గర ఏదో జరుగుతుందని అపోహలు వద్ద న్నారు. ఈ ఎక్స్‌పోలో 40 మంది ప్రముఖ బిల్డర్స్ 100కి పైగా ప్రాజె క్టులను ప్రదర్శిం చారని ఆ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ అసోసి యేషన్ల ప్రతినిధులు సునీల్ చంద్ర రెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

టాటా నెక్సాన్ 7 లక్షల యూనిట్ల విక్రయం

న్యూఢిల్లీ : టాటా మోటార్స్ కంపాక్ట్ ఎస్‌యువి నెక్సాన్ అమ్మకాల్లో మరో మైలురాయిని చేరుకున్నట్లు ప్రకటించింది. ఇప్పటి వరకూ ఏడు లక్షల యూనిట్లు విక్రయించినట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా టాటా మోటార్స్ డీలర్లు, షోరూమ్‌ల వద్ద ప్రత్యేక వేడుకలు నిర్వహించినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా నెక్సాన్ కార్లను బుక్ చేసుకుని డెలివరీ కోసం వేచి చూస్తున్న వారికి రూ.లక్ష వరకూ బెనిఫిట్లు కల్పిస్తున్నట్లు తెలిపింది. 2017 సెప్టెంబర్ 21న తొలిసారి టాటా నెక్సాన్ కారును అందుబాటులోకి తెచ్చింది.

హెల్పేజ్ ఇండియా నివేదిక.. భారతదేశం యొక్క పెద్దలు తమ తర్వాతి సంవత్సరాలకు సిద్ధంగా లేరు

నవతెలంగాణ : హెల్పేజ్ ఇండియా, నేడు 'ప్రపంచ వృద్ధ దుర్వినియోగ అవగాహన దినోత్సవం' (జూన్ 15) సందర్భంగా తన జాతీయ 2024 నివేదిక- 'భారతదేశంలో వృద్ధాప్యం: సంరక్షణ సవాళ్లకు సిద్ధత మరియు ప్రతిస్పందనను అన్వేషించడం' విడుదల చేసింది. తరువాత భారత అంతర్జాతీయ కేంద్రంలో ప్రైవేట్ రంగం, ప్రభుత్వం, సమాజం మరియు అంతర్జాతీయ సామాజిక రంగాల నుండి వివిధ నిపుణులతో ప్యానెల్ చర్చలు నిర్వహించబడ్డాయి. ఈ అధ్యయనం 10 రాష్ట్రాలలోని 20 టియర్ I మరియు టియర్ II నగరాల్లో నిర్వహించబడింది. 5169 మంది వృద్ధులు మరియు 1333 మంది సంరక్షకుల ప్రాథమిక కుటుంబ సభ్యులను సర్వే చేశారు. సర్వే SEC B & C వర్గాల మధ్య నిర్వహించబడింది.

బొమ్మల తయారీదారులను శక్తివంతం చేయడానికి ఫ్లిప్‌కార్ట్ DPIITతో భాగస్వామ్యం

నవతెలంగాణ : భారతదేశాన్ని "బొమ్మల ఎగుమతి కేంద్రం"గా నిలబెట్టే లక్ష్యంను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు, భారతదేశ స్వదేశీ ఈ-కామర్స్ మార్కెట్ ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్, డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (DPIIT) సహకారంతో ప్రపంచపు టాయ్స్ సప్లై చైన్ లో భారతదేశ సామర్థ్యాలు పెంపొందించటానికి ఒక వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఈ వర్క్‌షాప్ భారతదేశం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వానికి ప్రాతినిధ్యం వహించే వినూత్న మరియు అధిక-నాణ్యత గల బొమ్మలను ఉత్పత్తి చేయడానికి దేశీయ తయారీదారులను తీర్చిదిద్దడం మరియు పునః నైపుణ్యం లను వృద్ధి చేయడంపై దృష్టి సారించింది. బొమ్మల కోసం భారతదేశాన్ని ప్రపంచవ్యాప్త తయారీ కేంద్రంగా మార్చడానికి, ప్రభుత్వం బొమ్మల కోసం సమగ్ర జాతీయ కార్యాచరణ ప్రణాళిక (NAPT) రూపకల్పనతో సహా అనేక వ్యూహాత్మక కార్యక్రమాలను అమలు చేస్తోంది. NAPT కింద నిర్వహించే కీలకమైన కార్యక్రమాలు నాణ్యత పెంపుదల, ఆవిష్కరణ మరియు మార్కెట్ విస్తరణ ద్వారా భారతీయ బొమ్మల పరిశ్రమను ఉన్నతీకరించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

ఇస్తే సరే..లేకపోతే..

ఎన్డీఏ సర్కార్‌కు ప్రతిపక్షాల అల్టిమేటం

- ఉపసభాపతి పదవి దక్కకపోతే..లోక్ సభ స్పీకర్ ఎన్నికల బరిలో విపక్షాల అభ్యర్థి



న్యూఢిల్లీ : 18వ లోక్‌సభ తొలి సమావేశాలు ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. 26న లోక్‌సభ కొత్త స్పీకర్‌ను ఎన్నుకోనున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు కూడా తమకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వకపోతే, స్పీకర్ పదవికి తమ అభ్యర్థిని నిలబెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవారం రోజుల్లో పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అంతకు ముందే దీనిపై తుది నిర్ణయం తీసుకోవాలని విపక్షాలు నిర్ణయించినట్టు సంకేతాలు వస్తున్నాయి.

గత ఐదేండ్లుగా ఖాళీగా డిప్యూటీ స్పీకర్ పదవి

17వ లోక్‌సభలో ఐదేండ్లపాటు డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీగా ఉంది. సాధారణంగా డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షాలకు ఇస్తారు. బీజేపీకి మెజార్టీ ఉండటంతో, అంతా తానే అన్నట్టుగా వ్యవహరించిన మోడీ చివరి వరకూ ఆ సీటును ఖాళీగానే ఉంచారు.

బీజేపీ అభ్యర్థికి జేడీయూ, టీడీపీ మద్దతు

టీడీపీ, జేడీయూ.. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో భాగమని, లోక్‌సభ స్పీకర్ పదవికి బీజేపీ ప్రతిపాదించిన అభ్యర్థికే మద్దతిస్తామని జనతాదళ్ (యునైటెడ్) నాయకుడు కేసీ త్యాగి ముందుగానే చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'జేడీయూ (జనతాదళ్-యునైటెడ్), టీడీపీ (తెలుగుదేశం పార్టీ) ఎన్డీయేలో ఉన్నాయి. బీజేపీ నామినేట్ చేసిన వ్యక్తికే (స్పీకర్) మద్దతు ఇస్తాం ' అని వెల్లడించారు. కొత్త లోక్‌సభ సీటును ఖాళీగానే ఉంచారు.

బీజేపీ అభ్యర్థికి జేడీయూ, టీడీపీ మద్దతు

టీడీపీ, జేడీయూ.. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో భాగమని, లోక్‌సభ స్పీకర్ పదవికి బీజేపీ ప్రతిపాదించిన అభ్యర్థికే మద్దతిస్తామని జనతాదళ్ (యునైటెడ్) నాయకుడు కేసీ త్యాగి ముందుగానే చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'జేడీయూ (జనతాదళ్-యునైటెడ్), టీడీపీ (తెలుగుదేశం పార్టీ) ఎన్డీయేలో ఉన్నాయి. బీజేపీ నామినేట్ చేసిన వ్యక్తికే (స్పీకర్) మద్దతు ఇస్తాం ' అని వెల్లడించారు.



కొత్త లోక్‌సభ స్పీకర్ టీడీపీ లేదా జేడీయూ నుంచి కావచ్చనే చర్చ కూడా నడుస్తోంది. మరోవైపు ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జేడీయూలనుంచి లోక్‌సభ స్పీకర్‌ను నియమించాలని ఆప్ సూచించింది. ఇది తమ ప్రయోజనాలతో పాటు రాజ్యాంగం, ప్రజాస్వామ్యానికి కూడా మేలు చేస్తుందని పేర్కొంది.

24న సెషన్ ప్రారంభం

18వ లోక్‌సభ తొలి సెషన్ 24న ప్రారంభమై జులై 3న ముగుస్తుందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు తెలిపారు. తొమ్మిది రోజుల ప్రత్యేక సెషన్‌లో మొదటి మూడు రోజుల్లో కొత్తగా ఎన్నికైన పార్లమెంటు సభ్యులు (ఎంపీలు) ప్రమాణ స్వీకారం చేస్తారు. అనంతరం లోక్‌సభ స్పీకర్‌ను ఎన్నుకుంటారు. అయితే మోడీ ప్రభుత్వం ఐదేండ్ల రూట్‌మ్యాప్‌ను ఖరారు చేసింది. రాష్ట్రపతి ప్రసంగం అనంతరం ప్రధాని మోడీ దీన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. మరోపక్క రాజ్యసభ 264వ సమావేశాలు జూన్ 27 నుంచి జూలై 3, 2024 వరకు జరగనున్నాయి. 2014 తర్వాత బీజేపీ తక్కువ బలంతో అధికారంలోకి రావడం ఇదే తొలిసారి. జూన్ 27న ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. 234 మందికి పైగా సభ్యులతో చాలా కాలంగా తర్వాత ప్రతిపక్షం బలమైన స్థానాన్ని సంపాదించుకున్నది. లోక్‌సభలో 99 మంది ఎంపీలను కలిగి ఉన్న కాంగ్రెస్, స్టాక్ మార్కెట్ స్కామ్ , నీట్ పరీక్షలో అవకతవకల ఆరోపణలపై ఇప్పటికే ప్రభుత్వంపై దాడి చేస్తున్నది. దీని వల్ల వచ్చే పార్లమెంట్ సమావేశాలు మరింత ఆసక్తికరంగా మారే అవకాశం ఉన్నదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ఉపాధ్యాయుడి హత్యలో భార్యే సూత్రధారి

- వివాహేతర సంబంధమే కారణం
- నలుగురి రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నాగేందర్

నవతెలంగాణ- ఉట్నూర్

ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజేందర్ హత్యకేసులో భార్యనే సూత్రధారి అని తేలింది. ఈ కేసును పోలీసులు నాలుగు రోజుల్లోనే ఛేదించారు. నలుగురు నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. శనివారం ఉట్నూర్ డీఎస్పీ తన కార్యాలయంలో హత్య కేసు వివరాలు వెల్లడించారు. జాదవ్ గజేందర్ జైనథ్ మండలంలోని మేడిగూడ జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదిలాబాద్‌లోని రాంనగర్‌లో భార్య విజయలక్ష్మి, కొడుకుతో కలిసి నివాసం ఉండేవాడు. వేసవి సెలవుల్లో స్వగ్రామం నార్నూర్ మండలంలోని నాగల్‌కొండకు వచ్చారు. పాఠశాలల పున:ప్రారంభం రోజున స్వగ్రామం నుంచే విధులకు బయలుదేరగా.. హత్యకు గురయ్యాడు. దీనికి అతని భార్యనే సూత్రధారిగా పోలీసులు విచారణలో తేల్చారు. జాదవ్ భార్య



విజయలక్ష్మి 2015లో నిజామాబాద్‌లో డిగ్రీ చదువుకుంది. అక్కడే డిగ్రీ చదివిన రాథోడ్ మహేష్, ఆమె ప్రేమించుకున్నారు. వీరిద్దరూ ఒకే మండలానికి చెందిన వారు. కానీ, 2017లో విజయలక్ష్మికి తల్లిదండ్రులు జాదవ్ గజేందర్‌తో వివాహం చేశారు. వారికి ఒక కొడుకు ఉన్నాడు. జాదవ్‌కు చిన్న వికలాంగత్వం ఉంది. దీంతో అతన్ని అయిష్టంగానే పెండ్లి చేసుకున్న విజయలక్ష్మి ఆ తర్వాత రాథోడ్ మహేష్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. భర్తను ఎలాగైనా చంపాలని ప్రియుడు మహేష్‌తో మాట్లాడి హత్యకు పథకం పన్నింది. ఈ నెల 12న పాఠశాలల పున:ప్రారంభం అవుతున్న నేపథ్యంలో 11న మహేష్‌కు ఫోన్ చేసి జాదవ్ లోకారి వైపు నుంచి ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళ్తాడని తెలిపింది. దీంతో మహేష్ తన స్నేహితులైన బేల మండలానికి చెందిన బోదే సుశీల్, ఉరివెత కృష్ణతో కలిసి హత్యకు ప్లాన్ వేశారు. జాదవ్ ఈనెల 12న పాఠశాలకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా అర్జుని గ్రామ శివారులో ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో అతను కింద పడిపోయాడు. లాక్కుంటూ కొద్ది దూరం తీసుకెళ్లి తలపై బండతో కొట్టి చంపారు. విచారణలో వివాహేతర సంబంధంతోనే ఈ హత్య జరిగిందని పోలీసులు నిర్ధారించారు. దాంతో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఉట్నూర్ సీఐ మొగిలి, నార్నూరు సీఐ రహీం పాషా ఉన్నారు.

రాష్ట్రంలో పాలన గాడి తప్పింది

- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యానించారు. రేవంత్ సర్కార్ తమ పార్టీపైన విద్వేషపూరితంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కార్పొరేషన్ మాజీ చైర్మెన్ సీ.రాకేశ్ కుమార్‌తో కలిసి సుమన్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. కేసీఆర్ ఫొటోలు పాఠ్య పుస్తకాలపై ఉన్నాయనే కారణంతో ప్రభుత్వం వాటిని వెనక్కు తెప్పించిందని గుర్తు చేశారు. తమిళనాడులో స్కూల్ బ్యాగులపై మాజీ సీఎం జయలలిత ఫొటోలు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి స్టాలిన్ ఆ విషయంపై రాద్ధాంతం చేయకుండా వాటిని పిల్లలకు పంపిణీ చేయించారని తెలిపారు. ఇక్కడి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవటం శోచనీయమని అన్నారు. రైతు బంధును ఇంకా ప్రారంభించలేదని వాపోయారు.

ఆర్నెల్లలో ఆరు స్కాములు..

- మన్నె క్రిశాంక్

రేవంత్ సర్కార్ ఆర్నెల్ల కాలంలో బియ్యం, లిక్కర్, ఫ్లైయాష్ తదితర ఆరు కుంభకోణాలకు పాల్పడిందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ...ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ఇలా స్కాములకు పాల్పడటం దారుణమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై ప్రశ్నిస్తే ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ ఒప్పందాలు, కాళేశ్వరం అంటూ అసలు విషయాలను పక్కదోవ పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా శాఖలో జరిగిన అవినీతిపై ముఖ్యమంత్రి రేవంత్ స్పందించాలంటూ డిమాండ్ చేశారు.

కుల గణన చేయాలి

- స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకులు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్
- ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా



నవతెలంగాణ - ముషీరాబాద్

కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం సమగ్ర కుల గణన చేసి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాం యాదవ్ అధ్యక్షతన హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిపై అనుమానం ఉంద న్నారు. పాత పద్ధతిలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని కుట్ర జరుగుతోందని తెలిపారు. ఓటర్ల ప్రకారం కాకుండా జనాభా ప్రతిపాదికన బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని బీసీలు నమ్మితే.. బిచ్చగాళ్లను చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లోనూ తమను అణగదొక్కుతూ బీసీ వ్యతిరేక వైఖరి అవలంబిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, లేని పక్షంలో తీవ్రస్థాయిలో వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు. బీసీల హక్కుల కోసం రాష్ట్రంలో అన్ని పార్టీలు కలిసి రావాలని కోరారు.

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. దేశంలో బీసీల పరిస్థితి ఇంత దారుణంగా ఉండటానికి కారణం కాంగ్రెస్ అని విమర్శించారు. కాంగ్రెస్‌కు బీసీ జనాభా గణన చేయాలనే ఆలోచన లేదని, ప్రశ్నలు అడిగిన ప్రతి ఒక్కరినీ సీఎం రేవంత్‌రెడ్డి అరెస్టు చేయిస్తున్నారని ఆరోపించారు. సమాజంలో 99 శాతంగా ఉన్న బీసీ, ఎస్టీ, ఎస్సీలు ప్రతిరోజూ ధర్నాలు చేస్తూ బతకాల్సింది వస్తోందన్నారు. జైల్లో ఉండేది కూడా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలేనన్నారు. సుప్రీంకోర్టులోనూ 79 శాతం అగ్ర వర్ణాల వారే జడ్జీలుగా ఉన్నారని తెలిపారు. అలాంటప్పుడు బీసీలకు అనుకూలంగా ఎలా తీర్పు వస్తుందని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల గారడీ లాగానే కామారెడ్డి డిక్లరేషన్ కూడా ఉంటుందని, కావునా బీసీల రిజర్వేషన్లకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహా ధర్నాలో జూలూరి గౌరీశంకర్, మాజీ ఎంపీ ఆనంద్ భాస్కర్, ఎంబీసీ వ్యవస్థాపకుడు, బీసీ టైమ్స్ సంపాదకులు సంగెం సూర్యారావు, ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మెన్ సాయిని నరేందర్, హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణకుమార్, టి.జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల క్రిష్ణ, గిరిజన రిజర్వేషన్ సాధన సమితి చైర్మెన్ సంజీవ్ నాయక్, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఓకు హ్యుందాయ్ దరఖాస్తు

ముంబయి : దక్షిణ కొరియాకు చెందిన కార్ల తయారీ కంపెనీ హ్యుందాయ్ ఇండియా ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రానుంది. ఇందుకోసం సెబీకి ఇష్యూ ప్రతిపాదిత దరఖాస్తును పెట్టుకుంది. ఐపీఓ ద్వారా దాదాపు రూ.25వేల కోట్లు సమీకరించాలని నిర్దేశించుకుంది. ఐపీఓలో భాగంగా ఆఫర్ ఫర్ సేల్‌లో 14.21 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. హ్యుందాయ్ 1996లో భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించింది. తన పోర్టుపోలియోలో 13 మోడళ్ల కార్లను కలిగి ఉంది.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : బీఆర్‌టీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలనీ, మాజీ ఎంపీ బి వినోద్ కుమార్, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు జి రాంబాబు, ఎల్ రూప్‌సింగ్ , పి నారాయణ,వి మారయ్య డిమాండ్ చేశారు. శనివారం వివిధ రంగాల కార్మికులతో చర్చించారు. వైద్యారోగ్య శాఖలోని ఆశాలకు, 104 ఉద్యోగులకు, కాంట్రాక్ ఎంప్లాయీస్‌కు, శిశు సంక్షేమ శాఖలో అంగన్‌వాడీలకు,వీఓఏలకు నెలవారీగా జీతాలు రావటం లేదని ఆవేదన వ్యక్తం చేశవారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు వారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

హజ్ కోలాహలం



వార్షిక హజ్ యాత్ర ముగుస్తుందనగా శనివారం లక్షలాది మంది ముస్లింలు అరాఫత్ పర్వతంపై చేరుకుని ప్రార్థనలు చేశారు. అరాఫత్ పర్వతం మక్కాకు 20 కి.మీ దూరంలో ఉంది. మహ్మద్ ప్రవక్త తన చివరి ఉపన్యాసం ఇక్కడే ఇచ్చారని ముస్లింలు విశ్వసిస్తారు.

గొర్రెల స్కాంపై విచారణను ప్రారంభించిన ఈడీ

- పశుసంవర్ధకశాఖ నుంచి ఫైళ్లను సేకరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్రంలో వెలుగు చూసిన గొర్రెల పంపిణీ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు విచారణను ప్రారంభించారు. దాదాపు రూ.700 కోట్లకు పైగా నిధుల దుర్వినియోగానికి సంబంధించిన ఈ స్కాంపై విచారణను జరపటానికి రాష్ట్రంలోని ఈడీ అధికారులతో పాటు బెంగళూరు, ఢిల్లీ నుంచి వచ్చిన అధికారులు టీంలుగా ఏర్పడి విచారణను ముందుకు సాగిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటి వరకు తమ వద్ద ఉన్న సమాచారంతో పాటు 2017 నుంచి 2023 వరకు సాగిన ఈ కుంభకోణానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి దోషులను తేల్చటానికి ఈడీ అధికారులు ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్టు సమాచారం. ఇందుకోసం, ఇప్పటి వరకు ఈ స్కాంపై రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు నిర్వహించిన దర్యాప్తు అంశాలను కూడా పరిగణలోకి తీసుకొని ముందుకు సాగాలని అధికారులు నిర్ణయించినట్టు తెలిసింది. ఈ కేసును ఏయే కోణాల నుంచి దర్యాప్తు జరపాలనే విషయమై ఈడీ అధికారులు శనివారం చర్చించినట్టు సమాచారం. అలాగే, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ నుంచి ప్రభుత్వ ప్రారంభించిన ఈ స్కీంకు సంబంధించిన ప్రతి ఒక్క ఫైల్, డాక్యుమెంట్, లబ్దిదారుల వివరాలను సేకరించే పనిలో ఈడీకి చెందిన ఒక

18న అకౌంట్స్ ఆఫీసర్ అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలో అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ అకౌంటెంట్ పోస్టులకు సంబంధించి ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 18న హైదరాబాద్‌లోని నాంపల్లి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల జాబితా టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని తెలిపారు. వెబ్‌సైట్‌లో పొందుపరిచిన అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలనూ వెంట తెచ్చుకోవాలని సూచించారు. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలో 64 సీనియర్ అకౌం టెంట్, 13 జూనియర్ అకౌంటెంట్, ఒక అకౌంట్స్ ఆఫీసర్ కలిపి 78 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ 2022, డిసెంబర్ 31న నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఇతర వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

త్వరలోనే నామినేటేడ్ పోస్టుల భర్తీ

- కార్యకర్తల రుణం తీర్చుకుంటా : ఏపీ సీఎం చంద్రబాబు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఎన్నికల్లో కష్టపడిపనిచేసిన నాయకులు, కార్యకర్తలకు త్వరలోనే నామినేటేడ్ పోస్టులు ఇస్తామని తెలుగుదేశం అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి ఆయన మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌కు వచ్చారు. ఈసందర్భంగా పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లోమాట్లాడారు. ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, బూత్‌స్థాయి కార్యకర్తలు ఇందులో పాల్గొన్నారు. కింది స్థాయి నుంచి ఎవరు ఎక్కడ పార్టీ కోసం పనిచేశారో వారికే పదవులు దక్కేలా అధ్యయనం ప్రారంభించామని అన్నారు. నేతలు, కార్యకర్తలు, సాధికారత సాధిస్తే పార్టీ పునాదులు బలంగా ఉంటాయని చెప్పారు. అన్న క్యాంటీన్లు ఎక్కెడెక్కడ మూతపడ్డాయో వాటిని వందరోజుల్లోనే తెరిపించే కార్యక్రమం చేపడతామని తెలిపారు. గత 20 ఏండ్లల్లో ఎన్నడూ గెలవని సీట్లలో కూడా ప్రజలు టీడీపీకి అధికారాన్ని కట్టబెట్టారంటే అది వారు పెట్టుకున్న నమ్మకమన్నారు. కూటమికి 93 శాతం స్ట్రైకరేట్ , 57 శాతానికిపైగా ఓట్లు వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కూటమిలోని మూడు పార్టీల పాత్ర ఎంతో కీలకంగా పనిచేసిందన్నారు. ఈ ఘన విజయానికి కారణమైన కార్యకర్తల రుణం తప్పకుండా తీర్చుకుంటామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఐదేండ్లపాటు కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. అధికారం ఉందని కక్షసాధింపులు, ప్రజావ్యతిరేక పనులు చేయకూడదని సూచించారు. ఎమ్మెల్యేలు, నేతలు కిందిస్థాయి కార్యకర్తలను విస్మరించకూడదన్నారు. బాధ్యతగా చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రజలు మళ్లీ ఆదరిస్తారని దిశానిర్దేశం చేశారు.

భూగర్భ జలవనరుల శాఖ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు 18న ధ్రువపత్రాల పరిశీలన

- టీజీపీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ భూగర్భ జలవనరుల శాఖలో ప్రకటించిన వివిధ గెజిటెడ్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 18న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)లో ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు. అందులో పొందుపరిచిన ఒరిజినల్ ధ్రువపత్రాలను అభ్యర్థులు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ష్ష్ష్.ంజూం.స్త్రశీఙ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. భూగర్భ జలవనరుల శాఖలో 32 గెజిటెడ్, 25 నాన్‌గెజిటెడ్ కలిపి 57 పోస్టుల భర్తీకి 2022, నవంబర్ 29న టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

పంపిణీకి నోచుకోని డబుల్ బెడ్‌రూం ఇండ్లు

- స్వాధీనం చేసుకున్న స్థానికులు
- ఖాళీ చేయించిన అధికారులు



నవతెలంగాణ-కడెం

నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలో రెండేండ్ల కింద బీఆర్ఎస్ ప్రభుత్వం 200 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించింది. అయితే నేటికీ పంపిణీ చేయకపోవడంతో మూడ్రోజుల కింద కడెం, కన్నాపూర్, పెద్దూర్ తండాలకు చెందిన పలువురు ఆ ఇండ్ల తాళాలు పగలగొట్టి స్వాధీనం చేసుకున్నారు. దాంతో రంగంలోకి దిగిన అధికారులు ఇండ్లను ఖాళీ చేయాలని వారికి సూచించారు. అయినా వారు ఖాళీ చేయకపోవడంతో శనివారం కడెం తహసీల్దార్ సుజాత రెడ్డి, నిర్మల్ సీఐ శ్రీనివాస్, కడెం ఎస్ఐ కృష్ణ సాగర్‌రెడ్డి, పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. అర్హులైన వారిని గుర్తించి త్వరలో ఇండ్లను పంపిణీ చేస్తామని చెప్పడంతో వారు ఖాళీ చేశారు.